శుక్రవారం
FRIDAY
9-10-2026
సంపుటి ( Volume):2 ‖ సంచిక: (Issue): 101
జగిత్యాల JAGITIAL ‖ పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com



అరచేతిలో ఈవార్తలు దినపత్రిక స్కాన్ చేయండి.. ఆండ్రాయిడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play




జూరాల నీళ్లు వదిలారని..

14 మంది రైతులపై

## కేసులు

**వనపర్తి జిల్లాలో కేసు నమోదు**

వనపర్తి, అక్టోబర్ 8 (ఈవార్తలు): సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు. సాగునీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో, గత నెల సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం వారే నేరుగా జూరాల ప్రాజెక్టు

తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ ...ఏం చేస్తుండు



2. Vide reference cited (13), the Director General, Telangana Fire, Disaster Response, Emergency and Civil Defence, Hyderabad has accorded permission to consider the promotions to the post of Leading Fire Fighter from the category of Fire Fighter Techn[...]al duly considering the Station Fire Officers Course wherever already completed instead of L[...] Training Course as the said course is superior course and they have [...]fore commencement of New Service Rules.

**హోం శాఖలో ఏం జరుగుతోంది?.. అగ్నిమాపకశాఖలో 'జీవో 86' చిచ్చు**

## ఇష్టం వచ్చినట్లు నిబంధనల మార్పు?

- కొత్త నిబంధనలతో ఉద్యోగులకు ఉరి
- దశాబ్దాల సేవచేసిన వారికి అడ్డంకులు
- ఎల్‌ఎఫ్‌వో పదోన్నతికి ఎస్‌ఎఫ్‌వో శిక్షణ
- ఎల్‌ఎఫ్‌వో శిక్షణ అవసరం లేదా?
- నిబంధనల అమలులో ఏకరూపతేది?
- ఉత్తర్వులోనే డీజీ అనుమతి ప్రస్తావన
- నిబంధనలపై ఉద్యోగుల ప్రశ్నలు

**తెలంగాణలో కీలకమైన హోంశాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా నిర్వహిస్తున్నారు. ఈ హోంశాఖ పరిధిలో పోలీస్ శాఖతో పాటు ఫైర్ సర్వీసెస్, జైళ్లు తదితర విభాగాల వ్యవహారాలు ఉన్నాయి. అయితే, తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ శాఖలో దశాబ్దాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కొత్త నిబంధనలతో సమస్యలు తలెత్తుతున్నాయన్న ఫిర్యాదులు ఎక్కువయ్యాయి.**

ఈవార్తలు ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్

1986, 1993 ప్రాంతాల్లో ఫైర్‌మెన్లుగా నియమితులైన ఉద్యోగులు తరువాత లీడింగ్ ఫైర్‌మెన్ స్థాయికి ఎదిగారు. ఇప్పుడు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పదోన్నతి దశలో కొత్త సేవా నియమాలు వారికి కొత్త అర్హతలు వారి పదోన్నతులకు ఉరితాడుగా మారాయి. హోంశాఖను ముఖ్యమంత్రి స్వయంగా నిర్వహిస్తున్నప్పుడు.. ఆ శాఖలోని తరువాయి 2 వ పేజీలో...

## ఎల్‌ఎఫ్‌వో పదోన్నతికి ఎస్‌ఎఫ్‌వో శిక్షణా..




**ఇక, తెలంగాణ అగ్నిమాపక శాఖలో పదోన్నతుల విషయంలో కొత్త ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఎల్‌ఎఫ్‌వో (లీడింగ్ ఫైర్ ఫైటర్) పదోన్నతికి అర్హత పొందిన కొందరు ఫైర్ ఫైటర్ టెక్నికల్ సిబ్బందికి నిర్దేశించిన శిక్షణకు బదులుగా, వారు గతంలో పూర్తి చేసిన ఎస్‌ఎఫ్‌వో (స్టేషన్ ఫైర్ ఆఫీసర్) కోర్సును పరిగణనలోకి తీసుకోవడానికి డీజీ అనుమతి ఇచ్చినట్లు అధికారిక ఉత్తర్వులోనే పేర్కొన్నారు. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.**

ఒక పోస్టుకు పదోన్నతి కల్పించేటప్పుడు ఆ పోస్టుకు సంబంధించిన శిక్షణ, అర్హతలను నిబంధనలు నిర్దేశిస్తే.. అదే శాఖలో మరో ఉన్నత స్థాయి పోస్టుకు సంబంధించిన శిక్షణను పూర్తి చేశారనే కారణంతో, అసలు పోస్టుకు నిర్దేశించిన శిక్షణను మినహాయించవచ్చా? తరువాయి 2 వ పేజీలో...

**ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి.**

### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,957 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,149 |

# ఎరుపెక్కిన ప్రపంచపటం!



- ఎల్ నినో కాదు.. సూపర్ డూపర్ ఎల్ నినో
- డిసెంబర్ నాటికి అతి తీవ్ర స్థాయికి చేరిక
- ఫిబ్రవరి 2027 వరకు కొనసాగే ప్రమాదం
- కరువు, వరదల ముప్పు పెరిగే అవకాశం
- డబ్ల్యూఎంవో తాజా అంచనాలు విడుదల

**భూమిపై వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేసే ఎల్‌నినో ప్రభావం మరింత బలపడుతోంది. మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 2026 అక్టోబర్-డిసెంబర్ కాలంలో రికార్డు స్థాయికి చేరే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) వెల్లడించింది. ఎల్‌నినో తీవ్రత పెరుగుతుండటంతో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, వర్షపాతంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుని కొన్ని ప్రాంతాల్లో కరువు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల ముప్పు పెరగవచ్చని పేర్కొంది.**

జెనీవా: డబ్ల్యూఎంవో విడుదల చేసిన నెలవారీ వివరాల ప్రకారం.. ఎల్‌నినో డిసెంబరులో గరిష్ఠ స్థాయికి చేరే ముందు రానున్న నెలల్లో మరింత తీవ్రరూపం దాల్చనుంది. ఈ ప్రభావం ఉష్ణోగ్రతలు, వర్షపాతం మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు, పర్యావరణ వ్యవస్థలు, ప్రజల జీవనంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం**

"ఎల్‌నినో ఇప్పటికే బలంగా ఏర్పడింది. ఇప్పుడు ఇది వేగంగా మరింత తీవ్రతరమవుతోంది. 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో కొనసాగేందుకు దాదాపు 100 శాతం అవకాశం ఉంది. 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన ఎల్‌నినోల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉంది" అని డబ్ల్యూఎంవో ప్రధాన కార్యదర్శి తరువాయి 2 వ పేజీలో...



# కాళేశ్వరం వద్ద చెత్త!

## త్రివేణి సంగమం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

**టాలీవుడ్ డైరెక్టర్ వేణు ఉడుగుల తీవ్ర ఆవేదన... ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని సూచన**

కరీంనగర్, అక్టోబర్ 8 (ఈవార్తలు): కాళేశ్వరం వద్ద పేరుకుపోయిన చెత్తపై టాలీవుడ్ దర్శకుడు వేణు ఉడుగుల ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. కాళేశ్వరం పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మన కాళేశ్వరం.. దక్షిణ భారత త్రివేణి సంగమం కాదా?' అంటూ ప్రశ్నించారు. అంతటి పవిత్ర ప్రదేశం దుర్వాసనతో ఒక్క క్షణం కూడా నిలబడలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పరిశుభ్రత లేకపోవడం మాత్రమే సమస్య కాదని అన్నారు. ఇది పరిపాలన, జవాబుదారీతనానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. 'భక్తి అనేది వ్యక్తిగతం. కానీ నది ప్రజలందరిదీ' అని వేణు ఉడుగుల అన్నారు. కాళేశ్వరంతరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



వాస్తవంగా ఉన్న వస్తువులు అకస్మాత్తుగా చిన్నవిగా లేదా పెద్దవిగా కనిపించడం, మనుషుల ముఖాలు, పరిసరాలు వింతగా మారినట్లు అనిపించడం వంటి అనుభూతులు అరుదైన 'ఆలిస్ ఇన్ వండర్‌ల్యాండ్ సిండ్రోమ్' లక్షణాలు కావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో మెదడు ఇంద్రియాల నుంచి అందే సమాచారాన్ని కొంతకాలం తప్పుగా అర్థం చేసుకోవడం వల్ల ఇటువంటి అనుభూతులు కలుగుతాయి. కొంతమందికి తమ చేతులు, తల లేదా మొత్తం శరీరం చిన్నదిగా లేదా పెద్దదిగా మారినట్లు కూడా అనిపించవచ్చు. కేవలం చూపులోనే కాకుండా శబ్దాలు వేగంగా లేదా నెమ్మదిగా వినిపించడం, సమయం చాలా వేగంగా లేదా నెమ్మదిగా గడుస్తున్నట్లు అనిపించడం కూడా ఈ పరిస్థితిలో కనిపించవచ్చు.



# స్టాక్ మార్కెట్ క్రాష్

## సెన్సెక్స్ 1,045 పాయింట్లు డౌన్

ముంబై: భారత ఈక్విటీ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భగ్గుమనడం, వడ్డీ రేట్లు దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలోనే కొనసాగుతాయనే ఆందోళనలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1045.46 పాయింట్లు (1.44%) పతనమై 71,593.24 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్లు (1.64%) నష్టపోయి 22,231.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర ఏకంగా 4% పెరిగి బ్యారెల్‌కు 104 డాలర్ల తరువాయి 2 వ పేజీలో...

# అరెస్ట్ చేయరాదు!

**పన్ను అధికారుల అధికారం రద్దు**

**జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు**



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో వ్యాపార వర్గాలకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పన్ను రేట్లలో ఎటువంటి మార్పులు చేయనప్పటికీ, అధికారుల అరెస్టు అధికారాలకు సంబంధించి కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. జీఎస్టీ రేట్లపై ఈ సమావేశంలో ఎటువంటి చర్చ జరగలేదని, వాటిని ఏడాదికి తరువాయి 2 వ పేజీలో...




# ఐటీ కంపెనీలపై ట్రంప్ కొరడా

## గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత

**పెర్మ్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి ఈ కంపెనీలను నిలిపివేస్తున్నట్టు ప్రకటన**

వాషింగ్టన్: అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది విదేశీ ఉద్యోగులకు, ముఖ్యంగా భారతీయులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు) కల్పించే ప్రక్రియలో కీలకమైన 'శాశ్వత కార్మిక ధ్రువీకరణ (పెర్మ్)' కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు పలు భారత ఐటీ దిగ్గజ కంపెనీలను సస్పెండ్ చేస్తున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో కాగ్నిజెంట్,తరువాయి 2 వ పేజీలో...

# భారత్‌లో స్టార్ లింక్‌ను అడ్డుకుంటున్నారు

**గుత్తాధిపత్య శక్తుల ప్రభావం: ఎలాన్ మస్క్**



వాషింగ్టన్: భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు అనుమతులు ఆలస్యం అవుతున్నాయంటూ టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆరోపించారు. "భారత ప్రజలపై గుత్తాధిపత్యాన్ని కొనసాగించేందుకు కొందరు ఒలిగార్కులు మమ్మల్ని అడ్డుకుంటున్నారు. వాళ్లు ఎవరో మీరు ఊహించవచ్చు" అంటూ ఆయన పోస్టు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలపై నేరుగా మస్క్ పేరు ప్రస్తావించకుండా కేంద్రం వివరణ ఇచ్చింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సహా అన్ని టెలికం సేవలకు న్యాయమైన, వివక్ష లేని అనుమతి విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొంది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించి మూడు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

9.10.2026

మేషం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

వృషభం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. చిన్ననాటి మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆప్తుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: అధికారుల అనుగ్రహంతో పదోన్నతుల పెరుగుతాయి. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుతాయి. నిరుద్యోగుల కలలు సాకారం అవుతాయి. కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల సహాయసహకారాలతో ముందుకు సాగుతారు. చేపట్టిన పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది.

కర్కాటకం: ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. నూతన ప్రయత్నాలు చేస్తారు. దూరపు బంధువుల ఆగమనం కొంత ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

సింహం: వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. వ్యయ ప్రయాసలతో గాని పనులు పూర్తి కావు. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది.

కన్య: ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

తుల: ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారులతో చర్చలు సఫలం అవుతాయి.

వృశ్చికం: బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టే విషయంలో పునరాలోచన చేయడం మంచిది.

ధనస్సు: మాతృ వర్గ బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. ఇంటాబయట ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. వాహన ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

మకరం: సోదరుల నుండి ధన సహాయం అందుతుంది. నూతన మిత్రులు పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. శుభకార్యాలకు ధనవ్యయం చేస్తారు. భాగస్వామి వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

కుంభం: వృత్తి ఉద్యోగాలలో ఇతరుల నుండి విమర్శలు అధికమవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణయత్నాలు చేస్తారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి.

మీనం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. కీలక సమయంలో సన్నిహితుల సలహాలు కలిసివస్తాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

# రేవంత్ ఏం చేస్తుండు



**మొదటి పేజీ తరువాయి**

ఫైర్ సిబ్బంది పదోన్నతి నిబంధనలపై తలెత్తుతున్న ప్రశ్నలు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లాయా? వెళ్లకపోతే ఎందుకు వెళ్లలేదు? వెళ్లి ఉంటే పరిష్కారం ఎందుకు కనిపించలేదు? ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

### 30-40 ఏళ్ల సేవకు ఫలితమేది?

2025 జూలై 11న ప్రభుత్వం జీవో నంబర్ 85, 86లను జారీ చేసి తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ శాఖకు కొత్త రాష్ట్ర సేవా, సబార్డినేట్ సేవా నియమాలను తీసుకొచ్చింది. ఆ తర్వాత డీజీ ఫైర్ సర్వీసెస్ కార్యాలయం కొత్త నియమాల అమలుపై సిబ్బందికి సంబంధించిన వివరాలు సేకరించేందుకు మెమో జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పదోన్నతికి లీడింగ్ ఫైర్‌ఫైటర్ కేడర్ నుంచి ఎంపికకు అవకాశం కల్పించడంతో పాటు శిక్షణ, పరీక్షలు, ఇతర అర్హతలు, చెల్లుబాటు అయ్యే హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ వంటి అంశాలు ముందుకు వచ్చాయి. నిబంధనలు కఠినంగా ఉండకూడదని ఎవరూ చెప్పడం లేదు. అగ్నిమాపక శాఖలో పనిచేసే ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వాహనాల నిర్వహణ, అత్యవసర స్పందన వంటి అంశాల్లో నైపుణ్యం అవసరమే. కానీ.. నియమాలను రూపొందించేటప్పుడు ఇప్పటికే 30-40 సంవత్సరాలుగా సేవ చేస్తున్న ఉద్యోగుల పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందా? అదే అసలు ప్రశ్న.

### రేవంత్ దృష్టికి వెళ్లలేదా?

ఒక ప్రభుత్వ శాఖలో అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తారు. శాఖ స్థాయిలో పరిశీలనలు జరుగుతాయి. న్యాయపరమైన పరిశీలన ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియలో సంబంధిత శాఖలు భాగస్వాములవుతాయి. చివరకు ప్రభుత్వం నిబంధనలను జారీ చేస్తుంది. మరి ఫైర్ శాఖలో ఏవైనా నిబంధనలు రూపొందించినప్పుడు హోం మంత్రిగా రేవంత్‌కు బాధ్యత ఉన్నట్లే. హోంశాఖలో వేల మంది ఉద్యోగుల సేవా ప్రయోజనాలను ప్రభావితం చేసే నిబంధనలు రూపొందుతున్నప్పుడు, వాటి ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించే వ్యవస్థ ఏం చేస్తోంది? అన్నదే అసలు ప్రశ్న. 2025 మేలో పోలీస్ శాఖ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా పోలీస్ వ్యవస్థను ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఉందని, సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యలు ఉంటే చర్చించుకుందామని కూడా పేర్కొన్నారు. అది మంచి విధానమే. కానీ, ఫైర్ సర్వీసెస్ ఉద్యోగుల సమస్యలపై స్పందనేది? అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులే. మంటల్లోకి వెళ్లేది వాళ్లే. ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను బయటకు తీసేది వాళ్లే. భవనాలు కూలినప్పుడు, రసాయన ప్రమాదాలు జరిగినప్పుడు, వరదలు వచ్చినప్పుడు, పారిశ్రామిక ప్రమాదాలు జరిగినప్పుడు ముందువరుసలో నిలిచేది కూడా వాళ్లే. అలాంటి శాఖలో దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగుల పదోన్నతుల విషయంలో నిబంధనల ప్రభావాన్ని అంచనా వేయడం ప్రభుత్వానికి కనీస పరిపాలనా బాధ్యత కాదా?

పాత ఉద్యోగులకు ఒకే కొలమానం ఎందుకు?

1986లో ఉద్యోగంలో చేరిన వ్యక్తి నేటికి దాదాపు నాలుగు దశాబ్దాల సేవ పూర్తి చేసి ఉంటారు. 1993లో చేరిన ఉద్యోగి కూడా మూడు దశాబ్దాలకు పైగా సేవ చేసి ఉంటారు. వారు కొత్తగా ఉద్యోగంలోకి వస్తున్న వారు కాదు. వారికి అగ్నిమాపక విధుల్లో అనుభవం ఉంది. శాఖలో పనిచేసిన సేవా రికార్డు ఉంది. ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. పదోన్నతులు పొందిన అనుభవం ఉంది. అయితే ఇప్పుడు కొత్త సేవా నియమాల కింద సాంకేతిక అర్హతలు, శిక్షణ, పరీక్షలు, హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ వంటి అంశాలు పదోన్నతి మార్గంలో కీలకంగా మారుతున్నాయి. అయితే ప్రభుత్వం ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. కొత్తగా నియమితుడయ్యే ఉద్యోగికి పెట్టే ప్రమాణాలను, పదవీ విరమణకు చేరువలో ఉన్న 30-40 ఏళ్ల అనుభవజ్ఞుడికి కూడా అదే విధంగా వర్తింపజేయడం తప్పనిసరిగా సరైన విధానమేనా? పదవీ విరమణకు నిర్దిష్ట సంవత్సరాల లోపు ఉన్న వారికి సడలింపు ఇవ్వలేరా?

ఒక్క జీవో ప్రభావం.. ఉద్యోగి జీవితం

ఒక జీవోను జారీ చేయడం పరిపాలనా ప్రక్రియలో ఒక దశ మాత్రమే. అది క్షేత్రస్థాయిలో అమలయ్యేటప్పుడు ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఎంతమంది ఉద్యోగులు ప్రభావితమవుతారు? ఎంతమందికి కొత్త అర్హతలు లేవు? ఎంతమందికి శిక్షణ అవసరం? ఎంతమంది పదవీ విరమణకు దగ్గరలో ఉన్నారు? ఎంతమంది పదోన్నతి అవకాశాన్ని కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు సేకరించకుండా నిబంధనలను అమలు చేయడం సమగ్ర పరిపాలనా ప్రక్రియగా పరిగణించవచ్చా? ఇది కేవలం ఫైల్‌పై సంతకం చేసే వ్యవహారం కాదు. ఒక జీవో వెనుక వేలాది కుటుంబాల ఉద్యోగ భవిష్యత్తు ఉంటుంది. అధికారులకే అన్నీ వదిలేస్తే.. మంత్రిత్వ బాధ్యత ఎందుకు? ప్రభుత్వ శాఖల్లో అధికారులు ఉంటారు. వారు నిబంధనల రూపకల్పనకు సాంకేతిక, పరిపాలనా సూచనలు ఇస్తారు. కానీ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మంత్రి వ్యవస్థ ఎందుకు ఉంటుంది? శాఖలో తీసుకునే నిర్ణయాలపై రాజకీయ పర్యవేక్షణ కోసం. ఉద్యోగులు, ప్రజలు, క్షేత్రస్థాయి వాస్తవాలు ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రతిబింబించేందుకు. జీవో 86 వల్ల పాత ఫైర్ సర్వీసెస్ ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఫిర్యాదులు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లాయా? వెళ్లి ఉంటే సమీక్ష ఎందుకు లేదు? వెళ్లకపోతే శాఖలో సమాచార ప్రవాహం ఎక్కడ ఆగింది? అన్న క్లారిటీ రావాల్సి ఉంది.

# ఎరుపెక్కిన ప్రపంచపటం!

**మొదటి పేజీ తరువాయి**

సెలెస్టె సౌలో తెలిపారు. ఈ అంచనా ఒకే వాతావరణ నమూనాపై ఆధారపడలేదని సంస్థ వెల్లడించింది. అమెరికాలోని వాషింగ్టన్ నుంచి జపాన్‌లోని టోక్యో, బ్రిటన్‌లోని లండన్, భారత్‌లోని పుణె వరకు 13 జాతీయ, అంతర్జాతీయ వాతావరణ కేంద్రాలు అందించే అంచనాలను సమన్వయం చేసి ఈ నిర్ధారణకు వచ్చినట్లు తెలిపింది. సముద్రంలోని తేలియాడే పరిశీలన పరికరాలు, ఉపగ్రహాలు, వాతావరణ పరిశీలన పరికరాల ద్వారా సేకరించే సమాచారాన్ని డబ్ల్యూఎంవో సమన్వయం చేస్తోంది.

నినో 3.4లో భారీ పెరుగుదల

ఎల్‌నినో తీవ్రతను అంచనా వేయడానికి పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖా ప్రాంత సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను సూచించే 'నినో 3.4' సూచీను విస్తృతంగా ఉపయోగిస్తారు. 2026 జూన్‌లో సాధారణ స్థాయితో పోలిస్తే ఈ సూచీ సగటున 1.6 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండగా.. ఆగస్టు నాటికి అది 2.5 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. అక్టోబర్-డిసెంబర్ కాలానికి నినో 3.4 సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత సాధారణ స్థాయి కంటే సగటున 3.7 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండవచ్చని డబ్ల్యూఎంవో అంచనా వేసింది. డిసెంబరులో ఇది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉంది. ఈ స్థాయి నమోదైతే ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఎల్‌నినో తీవ్రతగా నిలుస్తుంది. ఇంతకుముందు అత్యధికంగా 2015 నవంబర్-2016 జనవరి మధ్య 2.6 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం అంచనా వేస్తున్న 3.7 డిగ్రీల సెల్సియస్ దానికంటే గణనీయంగా ఎక్కువ.

సముద్రంలో దాగిన వేడి విడుదల

ఎల్‌నినో భూమికి కొత్తగా వేడిని సృష్టించదని డబ్ల్యూఎంవో వివరించింది. సముద్రం తనలో నిల్వ చేసుకున్న వేడిలో కొంత భాగం వాతావరణంలోకి విడుదల కావడం వల్ల ఎల్‌నినో సమయంలో ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. "బలమైన ఎల్‌నినో ఏర్పడినప్పుడు ప్రపంచంలో అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటి నమోదయ్యే అవకాశం ఉంటుంది. 2024లో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. ప్రస్తుతం సముద్రాల్లో ఇప్పటివరకు కొలిచిన అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో విడుదల కావడానికి మరింత వేడి అందుబాటులో ఉంది" అని సెలెస్టె సౌలో తెలిపారు.

హిందూ మహాసముద్రంపైనా ప్రభావం

ఎల్‌నినోతో పాటు ఇతర సముద్ర ప్రాంతాల్లోని పరిస్థితులు కూడా రాబోయే కాలపు వాతావరణాన్ని ప్రభావితం చేయనున్నాయి. సానుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువం (ఐఓడీ) అక్టోబరులో గరిష్ఠ స్థాయికి చేరి ఆ తర్వాత తగ్గే అవకాశం ఉందని డబ్ల్యూఎంవో అంచనా వేసింది. అక్టోబర్-డిసెంబర్ కాలానికి ఐఓడీ ప్రభావం సుమారు ౦0.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉండవచ్చని తెలిపింది. భారత మహాసముద్ర ప్రాంతంలో వర్షపాతాన్ని ప్రభావితం చేయగల కీలక వాతావరణ పరిణామాల్లో ఐఓడీ ఒకటి. అదే సమయంలో భూమధ్యరేఖా ప్రాంత అట్లాంటిక్ మహాసముద్రంలోనూ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే అధికంగానే కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూఎంవో పేర్కొంది.

# ఎల్‌ఎఫ్‌వో పదోన్నతికి ఎస్‌ఎఫ్‌వో శిక్షణా..

**మొదటి పేజీ తరువాయి**

మినహాయించవచ్చంటే.. దానికి ఆధారం ఏమిటి? ఎవరు నిర్ణయించారు? ఆ నిర్ణయానికి వర్తించే స్పష్టమైన నిబంధన ఏది? ప్రాంతీయ ఫైర్ అధికారి, మల్టీ జోన్-1, హైదరాబాద్ జారీ చేసిన ఏప్రిల్ 22, 2026 నాటి ఉత్తర్వులో ఈ అంశం స్పష్టంగా ప్రస్తావనకు వచ్చింది. డీజీ అనుమతితో, ఫైర్ ఫైటర్ టెక్నికల్ కేటగిరీ నుంచి లీడింగ్ ఫైర్ ఫైటర్ పదోన్నతికి లీడింగ్ ఫైర్ ఫైటర్ శిక్షణ కోర్సుకు బదులుగా ఇప్పటికే పూర్తి చేసిన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కోర్సును పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తర్వు పేర్కొంటోంది. ఇదే ఇప్పుడు ఉద్యోగుల్లో ప్రధాన సందేహానికి కారణమవుతోంది. ఒకవేళ ఎస్‌ఎఫ్‌వో శిక్షణ ఎల్‌ఎఫ్‌వో శిక్షణ కంటే ఉన్నతమైనదైతే.. ఎల్‌ఎఫ్‌వో పదవికి ప్రత్యేకంగా ఎల్‌ఎఫ్‌వో శిక్షణను నిబంధనల్లో ఎందుకు నిర్దేశించారు? అది తప్పనిసరి కాదంటే.. నిబంధనల్లో దానిని ఎందుకు ఉంచారు? తప్పనిసరి అయితే.. కొందరికి మాత్రమే దానికి బదులుగా మరో కోర్సును ఎందుకు పరిగణించారు? ఇదే విషయాన్ని శాఖ స్పష్టంగా వివరించాల్సిన అవసరం ఉంది. ఫైర్ శాఖలో ప్రతి స్థాయి పదవికి ప్రత్యేక బాధ్యతలు ఉంటాయి. ఫైర్ ఫైటర్, లీడింగ్ ఫైర్ ఫైటర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ స్థాయిల్లో విధులు, బాధ్యతలు, నిర్ణయాధికారం మారుతూ ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో ఒక ఉన్నత స్థాయి శిక్షణ పూర్తి చేశారనే కారణంతో దిగువ స్థాయి పదవికి నిర్దేశించిన శిక్షణను స్వయంచాలకంగా సమానంగా పరిగణించడం ఎంతవరకు సమంజసం? ఇక్కడ సమస్య ఎస్‌ఎఫ్‌వో కోర్సు తక్కువదా? ఎక్కువదా? అన్నది కాదు. పదోన్నతి అర్హతలను నిర్ణయించే సమయంలో ఒక నిర్దిష్ట శిక్షణను నిర్దేశించి, ఆ తర్వాత అదే శిక్షణకు బదులుగా మరో కోర్సును పరిగణించే విధానానికి స్పష్టమైన ప్రమాణం ఉందా? అన్నదే అసలు ప్రశ్న. ఇక ఉత్తర్వులో పదోన్నతులు తాత్కాలిక ప్రాతిపదికన, ఎలాంటి సీనియారిటీ హక్కు లేకుండా, కోర్టు కేసులు లేదా ఆదేశాల ఫలితానికి లోబడి ఉంటాయని పేర్కొన్నారు. .

# కాళేశ్వరం వద్ద చెత్త!

**మొదటి పేజీ తరువాయి**

ప్రస్తుత పరిస్థితికి గత ప్రభుత్వాలను నిందించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని సూచించారు. వేణు ఉడుగుల పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాళేశ్వరం ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయాలని నెటిజన్లు కోరుతున్నారు. పవిత్ర ప్రదేశాల పరిశుభ్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వేణు ఉడుగుల 'నీది నాది ఒకే కథ' సినిమాతో దర్శకుడిగా టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఆ తర్వాత రానా దగ్గుబాటి హీరోగా 'విరాటపర్వం' తెరకెక్కించారు.

## జూరాల నీళ్లు వదిలారని..14 మంది రైతులపై కేసులు

**మొదటి పేజీ తరువాయి**

వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# స్టాక్ మార్కెట్ క్రాష్

**మొదటి పేజీ తరువాయి**

మార్కును దాటడం మార్కెట్లలో భయాందోళనలకు ప్రధాన కారణమైంది. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మరింత పెంచుతుందనే ఆందోళనలు రేకెత్తించింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 22,179.90 వరకు పడిపోయి, 2026 సంవత్సరంలోనే అత్యంత కనిష్ట స్థాయిని నమోదు చేసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయిలను కోల్పోయిందని, ఇప్పుడు 22,000 పాయింట్ల మానసిక మద్దతు స్థాయిపై దృష్టి కేంద్రీకృతమైందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ సూచీ కోలుకోవడానికి ప్రయత్నిస్తే 22,400, ఆ తర్వాత 22,600 వద్ద ప్రతిఘటన ఎదుర్కోవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ కనిపించింది.

## ఐటీ కంపెనీలపై ట్రంప్ కొరడా

**మొదటి పేజీ తరువాయి**

ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో అమెరికా కార్మిక శాఖ ఇకపై ఈ కంపెనీల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించదు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించదు. అయితే, ఈ చర్యల ప్రభావం ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ఉండదని, కేవలం గ్రీన్ కార్డు మంజూరు ప్రక్రియపైనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కంపెనీలలో పనిచేస్తున్న విదేశీయులు గ్రీన్ కార్డు పొందడం ఇకపై దాదాపు అసాధ్యంగా మారనుంది. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, ముఖ్యంగా మైక్రోసాఫ్ట్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. "అమెరికాలో ఈ వ్యవస్థను మైక్రోసాఫ్ట్ కంటే ఎక్కువగా ఎవరూ దుర్వినియోగం చేయలేదు. ఆ సంస్థ సుమారు 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డు ఓలు పొందింది. ఇది అమెరికన్ల స్థానంలో విదేశీ బానిస ఓలను నియమించుకోవడమే" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

## ప్రపంచ వాతావరణంపై విస్తృత ప్రభావం

**మొదటి పేజీ తరువాయి**

ఎల్‌నినో బలపడుతున్న నేపథ్యంలో రాబోయే నెలల్లో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. వర్షపాత నమూనాల్లో మార్పుల కారణంగా ఒక ప్రాంతంలో వర్షాభావం, మరో ప్రాంతంలో అధిక వర్షాలు సంభవించే పరిస్థితులు ఏర్పడవచ్చు. దీంతో వ్యవసాయం, నీటి వనరులు, ఆహార భద్రత, ప్రజారోగ్యం, పర్యావరణ వ్యవస్థలపై ప్రభావం పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం ప్రాంతానికో విధంగా ఉండే అవకాశం ఉన్నందున.. రానున్న నెలల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాతం, సముద్ర పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులను నిరంతరం పర్యవేక్షించడం కీలకంగా మారనుంది.

# అరెస్ట్ చేయరాదు!

**మొదటి పేజీ తరువాయి**

ఒకసారి మాత్రమే సమీక్షిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ప్రధానంగా పరిపాలనాపరమైన అంశాలపైనే దృష్టి సారించినట్లు ఆమె వెల్లడించారు. అలాగే, వ్యాపారులపై ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు ఉద్దేశించిన కనీసం పరిమితిని రూ. 1 కోటి నుంచి రూ. 5 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇది వ్యాపార వర్గాలకు పెద్ద ఊరటనిచ్చే పరిణామం. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌ల విషయంలోనూ కౌన్సిల్ సానుకూల నిర్ణయం తీసుకుంది. సప్లయర్‌కు పూర్తి మొత్తం చెల్లించి, సక్రమమైన ఇన్‌వాయిస్‌లు కలిగి ఉన్న కొనుగోలుదారుల ప్రయోజనాలను రక్షించే మార్గాలను అన్వేషించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు నెలల్లోగా తన నివేదికను సమర్పించనుంది. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వ్యాపారం సాగించే చిన్న వ్యాపారుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేశారు. అలాగే, వారిపై సాధారణ జరిమానాను రూ. 25,000 నుంచి రూ. 10,000కి తగ్గించారు. ఈ నిర్ణయాలు చిన్న వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుస్తాయని భావిస్తున్నారు.

## భారత్‌లో స్టార్ లింక్‌ను అడ్డుకుంటున్నారు

**మొదటి పేజీ తరువాయి**

సంస్థలకు లైసెన్సులు మంజూరు చేసినట్లు తెలిపింది. వీటిలో స్టార్‌లింక్, రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్‌కు చెందిన వన్‌వెబ్ ఉన్నాయి. అయితే మూడు సంస్థలకు భద్రతా అనుమతుల ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని కేంద్రం స్పష్టం చేసింది. భద్రతా పరిశీలన పూర్తైన తర్వాతే స్పెక్ట్రమ్ కేటాయింపునకు తదుపరి దశకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం మూడు సంస్థలు దాదాపు ఒకే నియంత్రణ దశలో ఉన్నాయని స్పష్టం చేసింది.



# 37 డిగ్రీల ఉష్ణోగ్రత

**రాష్ట్రంలో మండుతున్న ఎండలు.. రాష్ట్రం నుంచి 'నైరుతి' నిష్క్రమణ**

హైదరాబాద్, అక్టోబర్ 8 (ఈవార్తలు): తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.


**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## నాపై పోటీ చేసి గెలువు

**కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్**

హైదరాబాద్, అక్టోబర్ 8 (ఈవార్తలు): ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్' అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలోనే జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం ధీమా వ్యక్తం చేశారు.

## తీర్థం ఇస్తే తాగినట్టు నటిస్తారు

**వేళ్ల సందుల నుంచి వదిలేస్తారు**

**వైసీపీ హయాంలో లడ్డూలో అక్రమాలు నిజం**

**విజయసాయి రెడ్డి తీవ్ర ఆరోపణలు**

తిరుపతి, అక్టోబర్ 8 (ఈవార్తలు): మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇవాళ తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొందరు ఆలయాలకు వెళ్లినప్పుడు అర్చకులు తీర్థం ఇస్తే, తాగినట్లు నటిస్తూ వేళ్ల సందుల్లోంచి కిందకు వదిలేస్తారని, ఇదే వారు పాటించే సెక్యులరిజం అని ఆయన విమర్శించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, తాను స్వచ్ఛమైన హిందువునని, ఇతర మతాల ప్రార్థనా స్థలాలకు కూడా వెళతానని అన్నారు. ఈ సందర్భంగా ఏపీలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసేలా తమ పార్టీ ఉంటుందని తెలిపారు. అధికార టీడీపీ కూటమి, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తర్వాత తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిలబడుతూ, ప్రభుత్వం, ప్రతిపక్షంపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంపై కూడా సాయిరెడ్డి స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లడ్డూ తయారీలో అక్రమాలు జరిగాయని అంగీకరించారు. అయితే, ప్రసాదంలో జంతు కొవ్వు ఉందన్న ఆరోపణలను ఆయన గట్టిగా ఖండించారు. తాము కిలో నెయ్యిని రూ. 320–400 మధ్య కొంటే, ప్రస్తుత ప్రభుత్వం రూ. 658కి కొంటోందని, బహిరంగ మార్కెట్‌లో స్వచ్ఛమైన నెయ్యి ధర రూ. 1,000 పైనే ఉందని పేర్కొంటూ నెయ్యి నాణ్యతను ప్రశ్నించారు. కడప జిల్లాలోని కొన్ని ఆలయాల్లోకి ఇప్పటికీ దళితులను అనుమతించడం లేదని ఆరోపించిన ఆయన... తమ పార్టీ అధికారంలోకి వస్తే అలాంటి వివక్ష చూపేవారికి కఠిన శిక్షలు, జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు.

## దసరాకు ఏపీఎస్ఆర్టీసీ 5,261 ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు భారీగా బస్సులు**

**ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు లేవని స్పష్టీకరణ**

విజయవాడ, అక్టోబర్ 8 (ఈవార్తలు): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేస్తోంది. పండుగ సీజన్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి మొత్తం 5,261 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులకు ఊరటనిస్తూ, ఈ ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలనే వసూలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సర్వీసులు అక్టోబర్ 16 నుంచి 25వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. పండుగకు ముందు, అనగా అక్టోబర్ 16 నుంచి 19 వరకు 3,207 బస్సులను, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 20 నుంచి 25 వరకు 2,054 సర్వీసులను నడపనున్నారు. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పెద్ద సంఖ్యలో బస్సులను కేటాయించారు. అత్యధికంగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు 1,186 బస్సులు నడుపుతుండగా, విజయవాడకు 1,053, బెంగళూరుకు 475, విశాఖపట్నానికి 440 బస్సులు కేటాయించారు. అలాగే రాజమండ్రికి 347, తిరుపతికి 247, చెన్నైకి 153 సర్వీసులు నడపనున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే, ఎన్టీఆర్ జిల్లా నుంచి అత్యధికంగా 804 ప్రత్యేక సర్వీసులు నడపనుండటం గమనార్హం. ఈ ఏడాది దసరా ఉత్సవాలు అక్టోబర్ 11న ప్రారంభం కానుండగా, 20న విజయదశమి పర్వదినం జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని, ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# దేశాన్ని రెండుగా విడగొట్టారు

**బీజేపీకి ఓటమి భయం.. అందుకే పేదల ఓట్లు తొలగింపు కుట్ర.. ఢిల్లీలో నిరసనలో సీఎం రేవంత్**

న్యూఢిల్లీ: ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు.



సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ హెచ్చరించారు.

## బీజేపీ టార్గెట్ తెలంగాణ

**బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు.. టీజీలో 92 లక్షల ఓట్లు తొలగించాయి**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 16న విశాఖలో వైసీపీ 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన'

వైజాగ్, అక్టోబర్ 8 (ఈవార్తలు): ఉత్తరాంధ్రలోని బీసీ వర్గాల గొంతుకను బలంగా వినిపించేందుకు వైసీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీన విశాఖపట్నంలో 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పార్టీకి చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకానున్నారని తెలిపింది. ప్రధానంగా రెండు కీలక అంశాలపై ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడించాయి. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన బీసీ నేతలు, ఈ వేదిక నుంచి తీవ్రంగా ఖండించాలని నిర్ణయించినట్టు తెలిపాయి.

## 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత

**పోలీసులతో నేతలకు తీవ్ర వాగ్వాదం**

**పొన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్**

హైదరాబాద్, అక్టోబర్ 8 (ఈవార్తలు): 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది. మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.


నేటి ఈవార్తలు

**COMMERCIAL RATE CARD**

**DISPLAY ADVERTISEMENTS**
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

**CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:**

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com

# మెడికల్ కళాశాల పనులు వెంటనే పూర్తి చేయాలి: జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 8 (ఈవార్తలు): జగిత్యాల వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రభుత్వం వెంటనే నివారించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో బుధవారం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులని, వాటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. గత ప్రభుత్వం జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కళాశాలలను మంజూరు చేసిందని తెలిపారు. జగిత్యాల వైద్య కళాశాలకు ఐదేళ్లు గడుస్తున్నా భవనాలు, వసతి గృహం, ప్రయోగశాలలు తదితర మౌలిక వసతులు పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. జగిత్యాల మినహా మంజూరైన ఇతర వైద్య కళాశాలల భవనాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. వైద్య కళాశాల విద్యార్థులు 24



గంటలుగా నిరసన చేస్తున్నా ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించకపోవడం సరికాదన్నారు. డిసెంబరు నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి 2027 నూతన సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

జగిత్యాలలో ప్రస్తుతం కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులు గత ప్రభుత్వ హయాంలో 2023లో మంజూరైన నిధులతోనే చేపడుతున్నాయని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనకు బీఆర్‌ఎస్ తరఫున సంఘీభావం ప్రకటించారు. సమస్యలను పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.



## గంగాధర బాలుర పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

గంగాధర, అక్టోబర్ 8 (ఈవార్తలు): గంగాధరలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, కళాశాలలో బతుకమ్మ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కులమత భేదాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

## 11 కేవీ ఉన్నత పీడన విద్యుత్ కనెక్షన్లకు ఏకరీతి ఛార్జీలు

**వినియోగదారులకు పారదర్శకత, వేగవంతమైన సేవలు: ఎస్ఈ**



జగిత్యాల, అక్టోబర్ 8 (ఈవార్తలు): 11 కేవీ స్థాయిలో అర్హత కలిగిన ఉన్నత పీడన విద్యుత్ కొత్త కనెక్షన్లు, అదనపు లోడ్లకు ఏకరీతి సేవా లైన్ ఛార్జీల విధానం అమల్లోకి వచ్చిందని జగిత్యాల సర్కిల్ ఎస్ఈ బి. సుదర్శనం తెలిపారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి నిబంధన నంబర్ 7, 2026 ద్వారా ఈ విధానం అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న 11 కేవీ ఉమ్మడి విద్యుత్ సరఫరా మార్గం నుంచి ఓవర్‌హెడ్ లైన్ ద్వారా కిలోమీటరు పరిధిలో ఉన్న అర్హత కలిగిన కనెక్షన్లకు ప్రతి కేవీఏ ఒప్పందిత డిమాండ్‌కు రూ.4,078 సేవా లైన్ ఛార్జీ వర్తిస్తుందని తెలిపారు. దీంతో ఛార్జీలపై ముందుగానే స్పష్టత లభించడంతో పాటు దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం కానుందని చెప్పారు. పారిశ్రామిక, వాణిజ్య, సమాచార సాంకేతిక రంగాల వినియోగదారులకు ఈ విధానం ప్రయోజనకరంగా ఉంటుందని



## జీతాలు రాక ఆసుపత్రి సిబ్బంది ఆందోళన

**రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని నిరసన**

**సుమారు 150 మంది విధుల బహిష్కరణ**

జగిత్యాల, అక్టోబర్ 8 (ఈవార్తలు): రెండు నెలలుగా వేతనాలు అందడం లేదని ఆరోపిస్తూ జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, తల్లి-శిశు ఆరోగ్య కేంద్రం, అత్యవసర చికిత్స ఆసుపత్రుల్లో పనిచేస్తున్న రోగుల సంరక్షణ, భద్రత, పారిశుద్ధ్య సిబ్బంది ఆసుపత్రుల ఎదుట నిరసన చేపట్టారు. పండుగ సమయంలోనూ జీతాలు అందకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 150 మంది ఆందోళనలో పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## ఇస్లాంపూర్‌కు ‘టీబీ ముక్త్ పంచాయతీ’ అవార్డు

గంగాధర, అక్టోబర్ 8 (ఈవార్తలు): ‘టీబీ ముక్త్ భారత్’ కార్యక్రమంలో భాగంగా ఇస్లాంపూర్ గ్రామపంచాయతీకి ‘టీబీ ముక్త్ పంచాయతీ’ గోల్డ్ ప్రశంసాపత్రం లభించింది. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు సాధనకు సహకరించిన వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు



## నారాయణపూర్‌కు ‘టీబీ ముక్త్ పంచాయతీ’ అవార్డు

గంగాధర, అక్టోబర్ 8 (ఈవార్తలు): ‘టీబీ ముక్త్ భారత్’ కార్యక్రమంలో భాగంగా నారాయణపూర్ గ్రామపంచాయతీకి ‘టీబీ ముక్త్ పంచాయతీ’ గోల్డ్ ప్రశంసాపత్రం లభించింది. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చేతుల మీదుగా గ్రామ ప్రతినిధులు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సేవకులు దీకొండ బాబాలక్ష్మి, మధుతో పాటు పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్య కళాశాల విద్యార్థుల సమ్మె విరమణ

**డిసెంబర్ 15లోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తాం.. మంత్రుల హామీ.. వెల్లడించిన కలెక్టర్**

జగిత్యాల, అక్టోబర్ 8 (ఈవార్తలు): జగిత్యాల వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యులు చేపట్టిన సమ్మెను గురువారం విరమించారు. విద్యార్థుల సమస్యలపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉన్నతాధికారులతో జరిగిన చర్చలు సానుకూలంగా సాగడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. డిసెంబరు 15లోగా వైద్య కళాశాల భవనం, వసతి గృహం, క్రీడా మైదానం, భోజనశాల తదితర మౌలిక వసతుల నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మంత్రులు ఫోన్‌లో విద్యార్థులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ



ఇచ్చారు. ప్రభుత్వ హామీలపై సంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు, వైద్యులు సమ్మె విరమించారు. శుక్రవారం నుంచి తరగతులు, వైద్యుల విధులు యథావిధిగా కొనసాగనున్నాయి. నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అదనపు కార్మికులను సమీకరించి రెండు నెలల్లో పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## గోదావరి పుష్కర ఘాట్లలో పటిష్ట ఏర్పాట్లు: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, అక్టోబర్ 8 (ఈవార్తలు): గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఘాట్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని రంగాసాగర్, మంగేలా, కమ్మనూరు, చిత్రవేణిగూడెం, రేకులపల్లి ఘాట్లను గురువారం ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మంగేలా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. బీర్‌పూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు రూ.9.36 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. రైతుల వినతి మేరకు రోల్లవాగు



ప్రాజెక్టు గేట్లు ఎత్తి పంటలకు సాగునీరు విడుదల చేశారు. రోల్లవాగు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. అటవీ అనుమతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. బీర్‌పూర్ ఘాట్ రహదారికి రెండు వరుసల రహదారి మంజూరైందని పేర్కొన్నారు.



## కిడ్స్ కాన్వెంట్ విద్యార్థులకు టైక్వాండో రెడ్ వన్ బెల్ట్

వేములవాడ అర్బన్, అక్టోబర్ 8 (ఈవార్తలు): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు టైక్వాండోలో ప్రతిభ చాటారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లోలోపు విక్టర్, ఎనిమిదో తరగతి విద్యార్థిని సోఫియా వేములవాడలో నిర్వహించిన టైక్వాండో బెల్ట్ పరీక్షల్లో రెడ్ వన్ బెల్ట్ సాధించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షన్ వస్సీయా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంపొందించవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆత్మరక్షణకు టైక్వాండో ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అభినందించారు.

## ఆర్‌టీఓ అధికారినంటూ సైబర్ మోసం

**నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

వేములవాడ రూరల్, అక్టోబర్ 8 (ఈవార్తలు): ఆర్‌టీఓ అధికారినంటూ ఫోన్‌లో పరిచయం చేసుకుని డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసి రూ.4,200 కాజేసిన నిందితుడిని వేములవాడ రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హన్మాజిపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు ఈ ఏడాది జూన్ 1న నిందితుడు ఫోన్ చేసి తాను సిరిసిల్ల ఆర్‌టీఓ కార్యాలయం నుంచి నరేష్‌నంటూ పరిచయం చేసుకున్నాడు. డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరించకపోతే లైసెన్స్ నిలిచిపోతుందని భయపెట్టాడు. అనంతరం తన ఆర్‌టీఓ అధికారితో మాట్లాడిస్తానని చెప్పి, గొంతు మార్చి తానే అధికారిగా మాట్లాడాడు. లైసెన్స్ పునరుద్ధరణ కోసం వెంటనే డబ్బులు చెల్లించాలని నమ్మించి ఫోన్‌పే ద్వారా మూడు విడతల్లో రూ.4,200 బదిలీ చేయించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు




చేపట్టారు. బ్యాంకు లావాదేవీలు, మొబైల్ నంబర్లు, గొంతు రికార్డింగ్, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించి నిందితుడిని నీరటి తిరుమల్ (32), నీరటి మల్లయ్య కుమారుడు, పాత అర్బన్ కాలనీ, వేములవాడగా గుర్తించారు. బుధవారం వేములవాడ అర్బన్ కాలనీలో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరానికి సంబంధించిన వివరాలను వెల్లడించాడు. అతడి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన వివో వి2036 మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో ఆర్‌టీఓ కన్సల్టెన్సీ కార్యాలయంలో పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించుకుని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పనుల కోసం తనకు పరిచయమైన వ్యక్తులను లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదే విధంగా మరికొందరి వద్ద కూడా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్‌టీఓ, పోలీసులు, బ్యాంకులు లేదా ఇతర ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 సైబర్ సహాయవాణికి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



## వేములవాడలో ‘సర్’ 98 శాతం పూర్తి

వేములవాడ అర్బన్, అక్టోబర్ 8 (ఈవార్తలు): వేములవాడ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియ 98 శాతం పూర్తయిందని ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, నవంబరు 9న తుది జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్ ప్రక్రియకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణకు నేటితో గడువు ముగియనుందని, ఇప్పటికే వచ్చిన క్లెయిములు, అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ నవంబరు 5 వరకు కొనసాగుతుందని చెప్పారు. నవంబరు 9తో సర్ ప్రక్రియ ముగుస్తుందని, ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తుల స్వీకరణ మాత్రం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వేములవాడ నియోజకవర్గంలో సర్ ప్రక్రియకు ముందు మొత్తం 2,29,132 మంది ఓటర్లు ఉండగా, ప్రక్రియ అనంతరం 2,02,323 మంది అర్హులుగా తేలినట్లు ఆర్డీఓ తెలిపారు. మిగిలిన 26,809 మందిలో ద్వంద్వ ఓట్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు తదితర అనర్హులైన ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. సమావేశంలో అఖిలపక్ష నేతలు పొలాస నరేందర్, మైలారం రాము, కదారి రాములు, చింతలకోటి రామస్వామిగౌడ్, ఎన్నికల సీనియర్ సహాయకుడు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో స్టార్‌లింక్..

ఎలాన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ ‘స్టార్‌లింక్’ భారత్‌లో తన సేవలను ప్రారంభించేందుకు గత ఐదేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అనేక నియంత్రణ సవాళ్లు, భద్రతా నిబంధనలు, వివాదాలను దాటుకుంటూ ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. అయినప్పటికీ తన సంస్థను భారత్‌లో అడుగు పెట్టడం లేదని ఎలాన్ మస్క్ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎక్స్ వేదికగా ముఖేష్ అంబానీని టార్గెట్ చేశారు. అయితే, ఈ ఐదేళ్ల ప్రయాణం, ఎదురైన అడ్డంకుల్ని పరిశీలిస్తే.. భారత్‌లో శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించే ప్రణాళికలపై స్పేస్‌ఎక్స్ దృష్టి సారించింది. గ్లోబల్ మార్కెట్‌తో పాటు భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. భారత్‌లో ‘స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్’ పేరుతో అనుబంధ సంస్థను రిజిస్టర్ చేశారు. అయితే ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే కనెక్షన్ల కోసం ముందస్తు బుకింగ్‌లు స్వీకరించడంతో టెలికాం శాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో ప్రీ బుకింగ్‌లను నిలిపివేశారు. భారత ప్రభుత్వ కొత్త శాటిలైట్ కమ్యూనికేషన్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా డేటా లోకలైజేషన్ (సమాచారం దేశంలోనే భద్రపరచడం) సెక్యూరిటీ క్లియరెన్స్‌లపై చర్చలు జరిగాయి. విదేశీ పెట్టుబడులు, భద్రతా నిబంధనల కారణంగా లైసెన్స్ ప్రక్రియ ఆలస్యమైంది. స్పేస్ సెక్టార్‌లో విదేశీ పెట్టుబడులకు ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేయడంతో, స్పెక్ట్రమ్ కేటాయింపు, లైసెన్సింగ్ ప్రక్రియ కోసం స్టార్‌లింక్ తన ప్రయత్నాలను వేగవంతం చేసింది. టెలికాం శాఖ నుంచి అధికారికంగా జీఎంపీసీఎస్ లైసెన్స్, అలాగే అంతరిక్ష నియంత్రణ సంస్థ ఇన్ స్పేస్ నుంచి తుది ఆమోదం లభించింది. డిసెంబర్ నాటికి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎలాన్ మస్క్ వెల్లడించారు. భారత్‌లో లాస్ట్-మైల్ కనెక్టివిటీ కోసం దేశవ్యాప్తంగా ఇప్పటికే 20 గేట్‌వే సైట్లను స్టార్‌లింక్ నిర్మించింది. డేటా సెక్యూరిటీ నిబంధనలను పూర్తి చేసి, ప్రస్తుతం స్పెక్ట్రమ్ కేటాయింపునకు సంబంధించిన తుది ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో భారత్‌లో స్టార్‌లింక్ లాంచ్ ఆలస్యం కావడంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తమ సంస్థ సేవలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కొద్దిమంది




బిలియనీర్లు, వ్యాపార దిగ్గజాలు మార్కెట్‌పై తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం స్టార్‌లింక్‌ను నిరోధిస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ అందకుండా అడ్డుకోవడం భారత ప్రజల పట్ల జరుగుతున్న నేరం అంటూ తీవ్ర పదజాలాన్ని ఉపయోగించారు. మస్క్ చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం (టెలికాం మంత్రిత్వ శాఖ) తీవ్రంగా ఖండించింది. స్టార్‌లింక్‌తో పాటు జియో, వన్‌వెబ్ వంటి అన్ని కంపెనీలకు ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. స్పెక్ట్రమ్ కేటాయింపు, సెక్యూరిటీ క్లియరెన్స్‌లకు సంబంధించిన ప్రక్రియ అందరికీ ఒకే విధంగా నిష్పక్షపాతంగా జరుగుతోందని తేల్చిచెప్పింది. మస్క్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసింది.

# ఎండీఆర్ వడ్డన జనవరికి వాయిదా?

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే భారీ విలువ గల లావాదేవీలపై ప్రతిపాదించిన రుసుము అమలును కొన్ని నెలల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో ప్రారంభం కానున్న పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం రుసుమును అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రతిపాదించింది. అయితే, ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నిర్ణయం వల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరకడమే కాకుండా, పండగ సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుందని అంచనా. ఆరేళ్లకు పైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగదారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారుల వైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకు పైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 నెలలోనే యూపీఐ ద్వారా రూ. 29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే, అది దసరా, దీపావళి వంటి పండగల సమయంలో వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో, ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభిస్తుంది.




# తర్వలో ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుంది: ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం త్వరలోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యుద్ధం ముగిసిన వెంటనే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేశారు. ఇరాన్ అణ్వాయుధం పొందకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రచార సభలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్ అణు ముప్పును ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం తీసుకున్న సైనిక చర్యలను ఆయన సమర్థించుకున్నారు. అమెరికా సైనిక చర్యలు త్వరలో ముగిసే అవకాశం ఉందని ట్రంప్ సంకేతాలిచ్చారు. "మేం త్వరలోనే అక్కడి నుంచి బయటకు వస్తాం. ఆ తర్వాత చమురు ధరలు కిందకు పడిపోతాయి" అని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని అంగీకరించినా.. ఊహించినంతగా పెరగలేదని చెప్పారు. గత ప్రభుత్వాలు ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యాయని ట్రంప్ విమర్శించారు. చాలా ఏళ్ల క్రితమే ఈ సమస్యను పరిష్కరించాల్సిందని పేర్కొన్నారు.



## ఉద్యోగులకు బీఎండబ్ల్యూ కార్లు గిఫ్ట్

బీజింగ్: చైనాలో ఓ రెస్టారెంట్ యజమాని తన ఉద్యోగుల పట్ల చూపిన ఉదారత ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటోంది. తన సిబ్బంది రోజూ విధులకు హాజరు కావడానికి పడుతున్న ఇబ్బందులను చూసి చలించిన ఆమె, కష్టపడి పనిచేసే కొందరు ఉద్యోగులకు సరికొత్త బీఎండబ్ల్యూ కార్లను బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరిచారు. మధ్య చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో మా యన్లీ అనే మహిళ బీఫ్ హాట్‌పాట్ రెస్టారెంట్ చైన్ నడుపుతున్నారు. తన ఉద్యోగులు చాలామంది ఎలక్ట్రిక్ స్కూటర్లపై చలి, వాన, గాలులను తట్టుకుంటూ పనికి రావడం ఆమె గమనించారు. వారి కష్టాన్ని చూసి, వారికి మెరుగైన సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకున్నారు. సెప్టెంబర్ 24న, కొందరు ఉద్యోగులను మీటింగ్ ఉందని చెప్పి ఓ బీఎండబ్ల్యూ షోరూంకు తీసుకెళ్లారు. అక్కడ వారికి కార్లను బహుమతిగా ఇస్తున్నట్లు చెప్పి సర్‌ప్రైజ్ చేశారు. ఒక్కో కారు విలువ సుమారు 3 లక్షల యువాన్లు (సుమారు రూ. 43 లక్షలు) వరకు ఉంటుంది. రెండు వారాల ముందే యన్లీ ఈ కార్లను పూర్తిగా డబ్బు చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో ఉద్యోగులు ఎలాంటి చెల్లింపులు చేయాల్సిన అవసరం లేకుండానే కార్లను సొంతం చేసుకున్నారు.

# సుపరిపాలనకు మొబైల్ సాధనం

**దేశంలోని ప్రతీ జిల్లాకు 5జీ సేవలు.. మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది.. ఐఎంసీ సదస్సులో ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ: భారత టెలికం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూనికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాంతరం చెందాయని అన్నారు. 'మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది' అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికం ప్రస్థానంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. "2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ముందడుగు వేశాం. ఈ రోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది" అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో 'డిజిటల్ విభజన' ఒక పెద్ద సవాలుగా ఉండేదని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసుకుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయులకు టెలికం అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, అంతకు మించి అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజిటల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తుచేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ 'సరిహద్దులు లేని విస్తరణ' అని, ఇది భారత టెలికం, డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన దేశ, విదేశీ టెలికం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులకు ప్రధాని స్వాగతం పలికారు.

# 'సర్'కు మద్దతుగా 42 మంది మాజీ జడ్జీల లేఖ

**ఈసీని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన**

**ఆధారాలు లేకుండా 'ఓట్ల చోరీ' ఆరోపణలు చేయొద్దంటూ అభ్యంతరం**

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ 42 మంది మాజీ న్యాయమూర్తులు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సంఘం (ఈసీఐ), న్యాయవ్యవస్థ సహా రాజ్యాంగ సంస్థలను బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా 'ఓట్ల చోరీ' అంటూ ఆరోపణలు చేయడంపై మాజీ న్యాయమూర్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థలను పదేపదే 'దొంగలు', 'లోపభూయిష్టమైనవి' అంటూ ముద్ర వేయడం ప్రజల్లో విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. 'సంస్థలను విమర్శించడం ప్రజాస్వామ్యంలో హక్కు. కానీ వాటిని కించపరచడం మాత్రం కాదు' అని లేఖలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి విశ్వాసమే కీలకమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేసేందుకు చేపట్టిన చట్టబద్ధమైన ప్రక్రియ 'సర్' అని మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఎన్నికలపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు అశాంతికి దారితీయొచ్చని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు అరాచక శక్తులకు ఊతమివ్వొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హేమంత్ గుప్తా, జస్టిస్ పంకజ్ మిట్టల్ సహా పలువురు ఈ లేఖపై సంతకం చేశారు. జమ్మూ కశ్మీర్, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీసీ పటేల్, కర్ణాటక హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుబ్రో కమల్ ముఖర్జీ, సిక్కిం హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ కూడా సంతకం చేసిన వారిలో ఉన్నారు. ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పందించారు. ఎన్నికల సంఘం నిర్వహించిన ఎన్నికల్లో గెలిచిన స్థానాలకు ప్రతిపక్ష నేతలు రాజీనామా చేయాలని సవాల్ చేశారు. ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తూ ప్రజల్లో విషం నింపే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

# నలుగురికి శిక్ష పడుతుంది: రాహుల్ గాంధీ

**మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్ ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నారు.. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు.. మూడో రోజుకు చేరిన ఇండియా కూటమి నిరసనలు**



న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఢిల్లీలో చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం సైతం విపక్ష ఎంపీలు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్.. ఈ నలుగురూ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. వారికి కచ్చితంగా శిక్ష పడుతుంది, అది మీరే చూస్తారు. ఇది మా హామీ" అని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. "మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లనివ్వలేదు. మా ఎంపీలపై దాడి చేశారు" అని ఆయన పేర్కొన్నారు. నిరసనల్లో భాగంగా విపక్ష ఎంపీలు తొలుత రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పించారు. కాగా, ఈ అంశంపై తదుపరి కార్యాచరణకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో విపక్ష ఎంపీలు భేటీ కానున్నారు. ఇందుకోసం ఇప్పటికే అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఎన్నికల సంఘంపై వస్తున్న ఆరోపణల గురించి వారు రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించనున్నారు.

# పాక్‌కు ఐఎంఎఫ్ 1.21 బిలియన్ డాలర్లు




ఇస్లామాబాద్: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి భారీ ఊరట లభించింది. ఆ దేశానికి అదనంగా 1.21 బిలియన్ డాలర్ల నిధులు అందించేందుకు ఐఎంఎఫ్ సిబ్బంది స్థాయి ఒప్పందానికి వచ్చారు. అయితే ఈ నిధుల విడుదలకు ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం అవసరం. ఈ ఒప్పందంలో పాకిస్థాన్ 37 నెలల 'ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ' (ఈఎఫ్ఎఫ్) కార్యక్రమంలో నాలుగో సమీక్ష, 28 నెలల 'రెసిలియన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీ' (ఆర్ఎస్ఎఫ్)లో మూడో సమీక్ష ఉన్నాయి. బోర్డు ఆమోదం తర్వాత ఈఎఫ్ఎఫ్ కింద సుమారు 1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద మరో 210 మిలియన్ డాలర్లు అందనున్నాయి. దీంతో ఈ రెండు కార్యక్రమాల కింద పాకిస్థాన్‌కు లభించే మొత్తం నిధులు సుమారు 5.7 బిలియన్ డాలర్లకు చేరతాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ 3.6 శాతం వృద్ధి సాధించినట్లు ఐఎంఎఫ్ అంచనా వేసింది. తొలి మూడు త్రైమాసికాల్లో వృద్ధి 4 శాతంగా నమోదైంది. మేలో గరిష్ఠ స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 10.3 శాతానికి తగ్గింది. విదేశీ మారక నిల్వలు సెప్టెంబర్ చివరికి 21.5 బిలియన్ డాలర్లకు పెరిగాయి. విదేశాల్లో ఉన్న పాకిస్థానీయుల నుంచి వచ్చిన నగదు బదిలీలు కూడా ప్రస్తుత ఖాతా లోటును అదుపులో ఉంచేందుకు దోహదపడ్డాయి.

# డీప్‌ఫేక్‌లకు చెక్

**ఏఐ నియంత్రణపై కేంద్రం కీలక ప్రకటన**

**నెల రోజుల్లోగా సంప్రదింపుల పత్రం విడుదల**

**మానవ కేంద్రిత విధానానికే తొలి ప్రాధాన్యత**

**నియంత్రణలో పరిశ్రమలదే కీలక బాధ్యత అని స్పష్టం**

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) నియంత్రణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఏఐ భద్రత, డీప్‌ఫేక్‌ల కట్టడి, మానవ కేంద్రిత విధానం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ, నెల రోజుల్లోగా ఒక సంప్రదింపుల పత్రం తీసుకురానున్నట్లు కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ పత్రం ఆధారంగానే భవిష్యత్తులో ఏఐ నియంత్రణ నిబంధనలను రూపొందించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ అభివృద్ధి నివేదిక విడుదల



కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. ఏఐ నియంత్రణకు సమయం ఆసన్నమైందని, ఈ టెక్నాలజీని ఎలా నియంత్రించాలనే దానిపై అభిప్రాయాలు సేకరించేందుకే ఈ సంప్రదింపుల పత్రం విడుదల చేస్తున్నట్లు తెలిపారు. "ఏఐ వినియోగానికి సంబంధించిన భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. దీనిపై దృష్టి సారించేలా ఒక నియంత్రణ-కేంద్రీకృత సంప్రదింపుల పత్రం తీసుకురావాలని నేను విభాగాన్ని కోరుతున్నాను" అని వైష్ణవ్ పేర్కొన్నారు. డీప్‌ఫేక్‌లు సమాజంలో పెను సంక్షోభాన్ని సృష్టించగల ఒక పీడ అని వైష్ణవ్ అభివర్ణించారు. వాటి సామర్థ్యం రోజురోజుకు మెరుగవుతోందని, ప్రజలు వాటిని సులభంగా నమ్మి తప్పుడు మార్గాల్లోకి వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్‌ల వల్ల సమాజంలో తప్పుడు అభిప్రాయాలు, కథనాలు ప్రచారంలోకి వస్తాయని ఆయన హెచ్చరించారు. ప్రతిపాదిత నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లో నైపుణ్యాభివృద్ధి, భద్రత, టెక్నాలజీ అభివృద్ధిలో ఎవరూ వెనుకబడకుండా చూడటం వంటి అంశాలు కూడా ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. ఏ మార్పు వచ్చినా అందులో మానవాళి ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని, నియంత్రణ విధానంలో ఇదే కేంద్ర బిందువుగా ఉండాలని ఆయన అన్నారు. ఏఐని కేవలం చట్టాల ద్వారా మాత్రమే నియంత్రించలేమని, సాంకేతికత, చట్టం కలగలిసిన 'టెక్నో-లీగల్' పరిష్కారం అవసరమని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. సైబర్ సెక్యూరిటీ, యూజర్ హార్మ్, డీప్‌ఫేక్‌ల వంటి ప్రమాదాలను ఎదుర్కోవడంలో సంస్థలదే ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి

**సుప్రీంకోర్టులో పిటిషన్**



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.



# రియాద్‌కు భారత విమానాలు రద్దు

**సౌదీలో భద్రతా కారణాలతో నిర్ణయం**

**అక్టోబర్ 10 వరకు సర్వీసులు నిలిపివేత**

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలో నెలకొన్న తీవ్ర భద్రతాపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయ విమానయాన సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్.. సౌదీ రాజధాని రియాద్‌కు నడిపే తమ విమాన సర్వీసులను అక్టోబర్ 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు గురువారం ప్రకటించాయి. ఈ మార్గంలో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు పూర్తిస్థాయిలో నగదు వాపసు (రిఫండ్) ఇవ్వనున్నట్లు లేదా అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీని మార్చుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారులు గత కొద్దిరోజులుగా సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, సైనిక స్థావరాలు, చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో, సౌదీ గగనతలాన్ని తమ సైనిక కార్యకలాపాలకు వేదికగా మార్చుకున్నామని, అందువల్ల అంతర్జాతీయ విమానయాన సంస్థల విమానాలు ఈ మార్గంలో ప్రయాణించవద్దని హౌతీలు గురువారం ఉదయం చివరి హెచ్చరిక జారీ చేశారు. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించాయి. బుధవారం రియాద్, అభా విమానాశ్రయాలపై హౌతీ తిరుగుబాటుదారులు జరిపిన దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించినట్లు సౌదీ అధికారులు ధ్రువీకరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు కీలక సూచనలు చేశారు. విమానాశ్రయానికి వచ్చే ముందు తమ విమాన ప్రయాణ స్థితిగతులను తెలుసుకోవడానికి నేరుగా సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు




# అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్

**వెయ్యి మంది ఉద్యోగుల తొలగింపు**

**భారత్‌లోనూ ఉద్యోగాల కోత**

న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి ఉద్యోగాల తొలగింపు ప్రక్రియను చేపట్టింది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. భారత్, అమెరికా, యూకే సహా పలు దేశాల్లోని రిటైల్ బృందాలపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది. రానున్న రోజుల్లో మొత్తం 30,000 మంది ఉద్యోగులను తొలగించాలనే విస్తృత ప్రణాళికలో భాగంగానే ఈ తాజా కోతలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే 'స్టోర్స్' వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులను తొలగించినట్లు రాయిటర్స్, బిజినెస్ ఇన్‌సైడర్ నివేదికలు పేర్కొన్నాయి. "మా ప్రాధాన్యతలను మెరుగ్గా చేరుకోవడానికి వీలుగా స్టోర్స్ బిజినెస్‌లో కొన్ని సర్దుబాట్లు చేశాం" అని అమెజాన్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు వివరించారు. అయితే, ఎంతమందిని తొలగించారనే కచ్చితమైన సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. మరోవైపు, కరోనా మహమ్మారి సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే ప్రస్తుత తొలగింపులకు కారణమని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అన్నారు. "ఆ సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ఎక్కువగా ఆర్డర్లు చేశారు. అది మాకు చాలా ఒత్తిడితో కూడిన కాలం" అని 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.



ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 9-10-2026, జగిత్యాల www.evarthalu.com 10

లవ్లీ చిత్రం



షెఫాలీ బగ్గా

## 'రణబాలి'.. ట్రైలర్ గర్జన




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ట్రైలర్ గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్, విడుదలైన కొద్ది క్షణాల్లోనే సోషల్ మీడియాలో ప్రభంజనం సృష్టిస్తోంది. భారీ యాక్షన్ ఘట్టాలు, భావోద్వేగ సన్నివేశాలతో కూడిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఈ చిత్రం 1854–1878 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందింది. బ్రిటిష్ పాలకుల దమననీతికి వ్యతిరేకంగా పోరాడిన ఒక వీరుడి గాథే 'రణబాలి'. ఇందులో 'శింగనమల బొబ్బిలి రణబాలి' అనే శక్తిమంతమైన పాత్రలో విజయ్ దేవరకొండ నటిస్తుండగా, ఆయన భార్య 'జయమ్మ'గా రష్మిక మందన్న కనిపించనుంది. బ్రిటిష్ అధికారి పాత్రలో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ నటించడం సినిమా స్థాయిని తెలియజేస్తోంది. 3 నిమిషాల 47 సెకన్ల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌లో విజయ్ దేవరకొండ తన విశ్వరూపాన్ని చూపించారు. పోరాట సన్నివేశాల్లో ఆయన నటన, సంభాషణలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత విజయ్–రష్మిక జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. నిజ జీవితంలో భార్యాభర్తలుగా మారిన తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో అమితాసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్, టీ–సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్–అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని విజయదశమి కానుకగా అక్టోబర్ 16న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పాన్–ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ చిత్రంపై ట్రేడ్ వర్గాల్లో సైతం భారీ అంచనాలు ఉన్నాయి.

## 'ఇండియన్ 3' వార్ మోడ్ ఆన్!

లోకనాయకుడు కమల్ హాసన్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఇండియన్ 3' నుంచి మేకర్స్ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. నేడు ఈ సినిమాకు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకుంది. "సేనాపతి జీరో టాలరెన్స్‌తో తిరిగి వస్తున్నారు. 'ఇండియన్ 3' వార్ మోడ్‌లో పునరుజ్జీవనం" అనే క్యాప్షన్‌ను జోడించింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వాస్తవానికి 'ఇండియన్ 2' చిత్రీకరణ సమయంలోనే మూడో భాగానికి సంబంధించిన కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. సినిమా నిడివి చాలా ఎక్కువగా ఉండటంతో కథను రెండు భాగాలుగా విడుదల చేయాలని దర్శకుడు శంకర్, కమల్ హాసన్ నిర్ణయించుకున్నారు. 'ఇండియన్ 2' కంటే మూడో భాగంపైనే తనకు ఎక్కువ ఆసక్తి ఉందని కమల్ హాసన్ గతంలోనే స్పష్టం చేశారు. 1996లో వచ్చిన 'ఇండియన్' సంచలన విజయం సాధించడంతో దానికి సీక్వెల్‌గా 'ఇండియన్ 2'ను 2017లో ప్రకటించారు. అయితే, ఈ సినిమా ప్రయాణం అనేక అడ్డంకులను ఎదుర్కొంది. సెట్స్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు మరణించడం, ఆ తర్వాత కరోనా మహమ్మారి, దర్శక–నిర్మాతల మధ్య విభేదాల కారణంగా షూటింగ్ చాలాకాలం నిలిచిపోయింది. ఆ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు శంకర్, కమల్ తో పాటు లైకా ప్రొడక్షన్స్ ఆర్థిక సహాయం ప్రకటించింది. అనంతరం రెడ్ జెయింట్ మూవీస్ రంగంలోకి దిగడంతో వివాదాలు పరిష్కారమై, చిత్రీకరణ తిరిగి ప్రారంభమైంది. ఎట్టకేలకు 'ఇండియన్ 2' పూర్తి చేశారు.




## నానా పటేకర్ కన్నుమూత

భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో గురువారం 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో 'గమన్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'పరిందా', 'అబ్ తక్ ఛప్పన్', 'యశ్వంత్', 'వజూద్' వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత 'శక్తి: ది పవర్', 'అపహరణ్', 'టాక్సీ నెం 9211' వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. 'వెల్కమ్' (2007), 'వెల్కమ్ బ్యాక్' (2015) చిత్రాలలో ఆయన పోషించిన 'ఉదయ్ శెట్టి' పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'రాజ్‌నీతి' చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం 'నటసామ్రాట్'లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా 'యశ్వంత్', 'వజూద్', 'ఆంచ్' వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## ఫేక్ న్యూస్‌పై ఢిల్లీ హైకోర్టుకు కంగనా



ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన వ్యక్తిత్వ, ప్రచార హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫోటో, గొంతును వాణిజ్యపరంగా వినియోగిస్తున్నారని, ముఖ్యంగా తప్పుడు వార్తలు, కృత్రిమ మేధ సాయంతో సృష్టించిన కంటెంట్ ద్వారా తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రతివాదులకు సమన్లు జారీ చేసింది. జస్టిస్ వికాస్ మహాజన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. కంగనా రనౌత్ తరఫున న్యాయవాది సాకేత్ సిక్రీ వాదనలు వినిపిస్తూ, ఆమె ప్రతిష్ఠను మసకబార్చే విధంగా ఉన్న పలు వెబ్ లింకులను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో కొన్ని యానిమేటెడ్ వీడియోలు, మీమ్స్ రూపంలో ఉన్నాయని, అవి వ్యంగ్య ధోరణిలో ఉన్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుత దశలో వాటిని తొలగించాలని తాము ఒత్తిడి చేయడం లేదని కంగనా తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. దావాకు సంబంధించిన నోటీసులు ముందే అందడంతో, కొందరు ప్రతివాదులు ఇప్పటికే అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించారని ఆయన న్యాయస్థానానికి వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కంగనా పిటిషన్‌పై ప్రతివాదులకు సమన్లు జారీ చేయడంతో పాటు మధ్యంతర ఉత్తర్వుల దరఖాస్తుపై నోటీసులు ఇచ్చింది. పిటిషన్ నుంచి కొందరు ప్రతివాదుల పేర్లను తొలగించిన నేపథ్యంలో, సవరించిన జాబితాను దాఖలు చేయాలని కంగనా న్యాయవాదిని ఆదేశించింది.

## సూర్య కేక పుట్టించే 'సీన్'

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు జిత్తు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సీన్'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చారు. గురువారం ఈ చిత్రం నుంచి "అమ్మో ఇది ఎవర్రా" అనే మొదటి పాటను విడుదల చేశారు. తమిళంలో "ఆతి ఇవ యార్రా" పేరుతో విడుదలైన ఈ పాట సినీ ప్రియులను, అభిమానులను ఆకట్టుకుంటోంది. నిర్మాణ సంస్థ ఝుగరం స్టూడియోస్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ పాటను పంచుకుంది. సుషిన్ శ్యామ్ స్వరపరిచిన ఈ గీతానికి తమిళంలో రాజప్రియన్ సాహిత్యం అందించి, స్వయంగా ఆలపించాడు. తెలుగులో రాకేందు మౌళి సాహిత్యం అందించగా, వినాయక్ ఆలపించాడు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.




## గాయం నన్ను మార్చింది: మాధురి రాథోడ్

ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్.. అద్భుత కంబ్యాక్ ఇచ్చింది. పలు వ్యక్తిగత కారణాలతో వార్తల్లో నిలిచిన ఈమె తాజాగా.. ఎవ్వరూ ఊహించని రేంజ్‌లో కమ్ బ్యాక్ ఇచ్చింది. 'బిందెలు బిందెలు బావయ్యో' అనే జానపద పాటకు సంబంధించిన ఫుల్ సాంగ్‌ను తాజాగా విడుదల చేసింది. ఇందులో ఫుల్ మాస్ ఎనర్జిటిక్ లెవెల్స్‌తో డ్యాన్స్ చేసి ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ఈ సాంగ్ వైరల్ అవుతోంది. ఒక్క రోజులోనే 1.2 మిలియన్ వ్యూస్ దాటి దూసుకుపోతోంది. కాగా, పాటకు సంబంధించిన విషయాన్ని తెలియజేస్తూ 'గాయం నన్ను మార్చింది. కంబ్యాక్ నన్ను కొత్తగా పరిచయం చేస్తోంది' అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది. యూట్యూబ్‌లోనూ మాధురి రాథోడ్‌కు మద్దతుగా వేలాది కామెంట్లు వెల్లువెత్తాయి.



## దర్శక మేధావి నర్సింగరావుకు డాక్టరేట్



ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు, కవి బి. నర్సింగరావు అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. జూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ప్రాంగణంలో వైభవంగా జరిగిన 27వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆయన ఈ గౌరవ పట్టాను స్వీకరించారు. తెలంగాణ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన 'మా భూమి' చిత్ర దర్శకుడిగా నర్సింగరావు సుప్రసిద్ధులు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని, సామాజిక వాస్తవికతను వెండితెరపై ఆవిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన్ననలు పొందిన విశిష్ట సృజనశీలిగా నర్సింగరావును కొనియాడారు.




## ఐపీఎల్‌తో పీఎస్ఎల్ పోటీ

పాకిస్తాన్ సూపర్ లీగ్ మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో పోటీపడనుంది. ఐపీఎల్ జరిగే సమయంలోనే మరోసారి పీఎస్ఎల్‌ను ప్లాన్ చేశారు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధికారులు. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. దీంతో కొంతమంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్ ఒప్పందాల నుంచి తప్పుకుని ఐపీఎల్‌లో చేరారు. ఈ చేదు అనుభవం చవిచూశాక కూడా పీఎస్ఎల్ ఐపీఎల్‌తో ఢీకొట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పీఎస్ఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన తేదీలను లీగ్ నిర్వాహకులు ఇవాళ ప్రకటించారు. ఈ టోర్నీలో వచ్చే ఏడాది మార్చి 18 నుంచి మే 2 వరకు జరగనుంది. మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించి తేదీలు ఖరారు కానప్పటికీ.. ఇంచుమించు పీఎస్ఎల్ జరిగే సమయంలోనే ఐపీఎల్ కూడా జరుగుతుంది. ప్రస్తుతమున్న సమాచారం ప్రకారం ఐపీఎల్ 2027 మార్చి మధ్యలో మొదలవుతుంది. ఐపీఎల్, పీఎస్ఎల్ మరోసారి క్లాష్ కానున్న నేపథ్యంలో మరోసారి విదేశీ ఆటగాళ్ల కోసం రెండు లీగ్‌ల మధ్య పోటీ తప్పకపోవచ్చు. గత సీజన్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్‌కు డైరెక్ట్ సైనింగ్‌గా ఎంపికైన స్పెన్సర్ జాన్సన్.. వ్యక్తిగత కారణాలు సాకుగా చూపి పీఎస్ఎల్ నుంచి వైదొలిగి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరాడు. శ్రీలంక ఆటగాడు దసున్ షనక లాహోర్ ఖలందర్స్ డీల్‌ను కాదనుకొని రాజస్తాన్ రాయల్స్‌లో చేరాడు. బ్లెస్సింగ్ ముజారబాని ఇస్లామాబాద్ యునైటెడ్‌తో ఒప్పందం రద్దు చేసుకొని కోల్‌కతా నైట్ రైడర్స్‌లో చేరాడు. దీంతో ముజారబానిపై ఏకంగా రెండేళ్ల నిషేధం విధించింది.

## సెలక్షన్ కోసం లంచం అడిగారు: పారా షూటర్లు

పారా ఆసియా గేమ్స్-2026 కోసం భారత జట్టు ఎంపిక ప్రక్రియలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని భారత పారా షూటర్లు ఆరోపించారు. ఎంపిక చేయాలంటే లంచం ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చారని సంచలన ఆరోపణలు చేశారు. పారా ఆసియా గేమ్స్‌లో పాల్గొనే పారా అథ్లెట్లకు ఢిల్లీలో గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా, పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా(పీసీఐ) ప్రెసిడెంట్ దేవేంద్ర ఝఝారియా, ప్రముఖ పారా అథ్లెట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జరుగుతుండగా వేదిక వెలుపల పారా షూటర్లు నిరసన తెలిపారు. ఈ నిరసనలో పాల్గొన్న షూటర్లలో ఆసియాలోనే గుర్తింపు పొందిన సందీప్ కుమార్, ఆకాశ్ కూడా ఉన్నారు. భారత జట్టుకు ఎంపిక చేయాలంటే తప్పనిసరి ముందస్తు షరతుగా ప్రభుత్వం ఇచ్చే నగదు బహుమతిలో 20 శాతం నియమిత కమిటీ అధికారులకు చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చినట్టు పారా షూటర్లు పేర్కొన్నారు. భారత బృందంలో ఎంపికైన ఓ వ్యక్తికి అధికారిక పోటీ షూటింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న రికార్డే లేదని తెలిపారు. అలాగే, ఓ టెక్నికల్ నిపుణుడు, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ ఎంపికను కూడా ప్రశ్నించారు. ఏకపక్ష నిర్ణయాలు, ఎంపిక నియమాల ఉల్లంఘన పట్ల తాను తీవ్ర మనస్తాపానికి గురైనట్టు సందీప్ తెలిపాడు. తన కంటే, ఆకాశ్ కంటే వెనుకున్న షూటర్‌ని ఎంపిక చేయడాన్ని ప్రశ్నించాడు. తన వాదనకు మద్దతు ఇచ్చే ఆధారాలతో అధికారులను సంప్రదించినప్పటికీ పీసీఐ ప్రెసిడెంట్ ఝఝారియా నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నాడు. మరో షూటర్ ఆకాశ్ మాట్లాడుతూ.. షూటింగ్ కోచ్ జై ప్రకాశ్ నౌటియాల్‌ను తన కోచ్‌గా పేర్కొననందుకు తనను పక్కనపెట్టారని ఆరోపించాడు. అయితే, పారా షూటర్ల ఆరోపణలను పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ఖండించింది. పూర్తిగా ప్రతిభ ఆధారంగానే ఎంపిక ప్రక్రియ జరిగిందని తెలిపింది.

## గంగూలీ వల్ల బాధపడ్డా



టీమిండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్న పాత వివాదంపై రవిశాస్త్రి తొలిసారి మౌనం వీడాడు. 2016లో భారత జట్టు ప్రధాన కోచ్ ఎంపిక ప్రక్రియలో భాగంగా తనను ఇంటర్వ్యూ చేయాల్సిన కమిటీలో ఉన్న గంగూలీ హాజరుకాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అది తనను అగౌరవపరిచినట్లు అనిపించిందని వెల్లడించాడు. 2014లో టీమిండియా 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా రవిశాస్త్రి బాధ్యతలు చేపట్టాడు. అతడి పదవీకాలం ముగిసిన అనంతరం, 2016లో బీసీసీఐ ఆ పదవిని రద్దు చేసి, ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తులను ఆహ్వానించింది. రవిశాస్త్రిని కూడా దరఖాస్తు చేసుకోవాలని బోర్డు సూచించింది. ఆ సమయంలో సౌరవ్ గంగూలీ, సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్‌లతో కూడిన క్రికెట్ సలహా మండలి (సీఏసీ) అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించింది. అయితే, రవిశాస్త్రి ఇంటర్వ్యూ సమయంలో గంగూలీ గైర్హాజరయ్యాడు. చివరికి, సీఏసీ రవిశాస్త్రిని కాదని అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా ఎంపిక చేసింది. ఈ పరిణామాలపై రవిశాస్త్రి స్పందిస్తూ, "జట్టు కోసం నేను శాయశక్తులా కృషి చేశాను. అటువంటి తరుణంలో నన్ను ఇంటర్వ్యూ చేయడానికి గంగూలీ రాకపోవడం నన్ను తీవ్రంగా బాధించింది" అని పేర్కొన్నాడు. "నేను డైరెక్టర్‌గా ఉన్న సమయంలో బోర్డు సభ్యులు వచ్చి ఆ పదవిని రద్దు చేస్తున్నామని చెప్పారు. హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకోమని సూచించారు. నన్ను కావాలనే బయటకు పంపించేందుకు కారణాల కోసం వెతికారనిపించింది. ఆ నిర్ణయం నన్ను ఎంతగానో కలచివేసింది" అని వ్యాఖ్యానించాడు.

# సంజూకు మరో చాన్స్?





### నేడు వెస్టిండీస్‌తో భారత్ రెండో టీ20
### ఐదు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో భారత్



తొలి టీ20లో వెస్టిండీస్ పై అదరగొట్టిన భారత్.. అదే జోరులో సిరీస్ లో 2-0తో ముందంజ వేయాలని చూస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో భారీ ఓటమి ఎదురైన వెస్టిండీస్ ఎలాగైనా పుంజుకుని సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలగా ఉంది. అయితే రాంచీలో శుక్రవారం జరిగే రెండో టీ20కి ముందు ఫలితం కంటే ఎక్కువగా ఆసక్తి రేపుతున్నది భారత జట్టు ఎంపికే. సంజూ శాంసన్ కొనసాగుతాడా? వైభవ్ సూర్యవంశీకి అవకాశం వస్తుందా? తొలి మ్యాచ్‌లో భారీగా పరుగులు ఇచ్చిన మయాంక్ యాదవ్‌కు మరో ఛాన్స్ ఇస్తారా? ఈ ప్రశ్నలకు శుక్రవారం సమాధానం దొరకనుంది.

లక్నోలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ 171 పరుగులు చేయగా.. భారత్ కేవలం 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లోనే అజేయంగా 102 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి 137 పరుగుల అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు సునాయాస విజయాన్ని అందించాడు. తొలి మ్యాచ్‌లో సంజూ శాంసన్ 11 పరుగులకే వెనుదిరిగాడు. అంతకుముందు అతడి చివరి నాలుగు టీ20 ఇన్నింగ్స్‌లు 9, 7, 2, 11 పరుగులుగా ఉన్నాయి. దీంతో ఓపెనింగ్ స్థానంపై చర్చ మొదలైంది. జట్టులో వైభవ్ సూర్యవంశీ రూపంలో దూకుడైన మరో ఓపెనర్ ఉన్నాడు. పవర్‌ప్లేలోనే బౌలర్లపై విరుచుకుపడే సామర్థ్యం వైభవ్‌కు ఉంది. అందుకే అతడిని తుది జట్టులోకి తీసుకుంటే భారత్ ఓపెనింగ్ కూర్పులో మార్పు చేసే అవకాశం ఉంటుంది. అయితే ఒక్క మ్యాచ్‌లో విఫలమైనందుకు సంజూను పక్కన పెడతారా? లేక అనుభవం ఉన్న వికెట్‌కీపర్ బ్యాటర్‌కు మరో అవకాశం ఇస్తారా? అన్నదే అసలు ఉత్కంఠ. బౌలింగ్‌లోనూ భారత్‌కు ఒక ప్రశ్న ఎదురవుతోంది. తొలి టీ20లో మయాంక్ యాదవ్ తన మొదటి ఓవర్లోనే 16 పరుగులు ఇచ్చాడు. మొత్తంగా కూడా అతడి బౌలింగ్‌లో పరుగుల వరద పారింది. అయితే రూథర్‌ఫోర్డ్‌ను ఔట్ చేసి ఒక వికెట్ సాధించాడు. మరోవైపు అరంగేట్ర మ్యాచ్‌లో నమన్ ధీర్ 3 వికెట్లతో అదరగొట్టాడు. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో స్పిన్ విభాగంపై భారత్‌కు పెద్దగా ఆందోళన కనిపించడం లేదు. పేస్ కూర్పులోనే మార్పు చేసే అవకాశం ఉంది.



## ఫాం కోసం సూర్య తంటాలు

రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో తమ తొలి మ్యాచ్‌కు ముంబై ప్రకటించిన జట్టులో స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కకపోయిన సంగతి తెలిసిందే. రెడ్ బాల్ క్రికెట్‌లో ఆడేందుకు సూర్యకుమార్ సిద్ధంగా ఉన్నప్పటికి సెలక్టర్లు మాత్రం పరిగణలోకి తీసుకోలేదు. అతడు దాదాపు ఏడాది నుంచి రెడ్‌బాల్ క్రికెట్‌కు దూరంగా ఉండడమే ఇందుకు కారణం. అంతేకాకుండా ముంబై ప్రీ-సీజన్ ప్రాక్టీస్ క్యాంప్‌లో కూడా అతడు పాల్గొనకపోవడంతో తొలి మ్యాచ్‌కు సూర్యను ఎంపిక చేయలేదు. ఈ క్రమంలో సూర్య ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మాజీ కెప్టెన్ ముంబై క్లబ్ క్రికెట్‌లో ఆడనున్నట్లు తెలుస్తోంది. ముంబై తరపున 'ప్రెసిడెంట్ కప్'లో సూర్యకుమార్ ఆడనున్నట్లు సమాచారం. ఈ టోర్నీలో ఆడి తన బ్యాటింగ్ రిథమ్‌ను తిరిగి పొందాలని సూర్య భావిస్తున్నట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్ట్ ఒకరు ఎక్స్ వేదికగా వెల్లడించారు. అతడు ఇక్కడ మెరుగైన ప్రదర్శన చేస్తే రంజీ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అతడు ఎంపికయ్యే అవకాశముంది. ఇక సూర్య చివరగా గతేడాది ఫిబ్రవరిలో విదర్భతో జరిగిన రంజీ ట్రోఫీ సెమీఫైనల్‌లో ముంబై తరఫున ఫస్ట్-క్లాస్ మ్యాచ్ ఆడాడు. ఓవరాల్‌గా ఇప్పటివరకు 86 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 42.34 సగటుతో 5,758 పరుగులు సాధించాడు. ఇందులో 14 సెంచరీలు, 30 అర్ధశతకాలు ఉండగా, అత్యధిక స్కోరు 200 పరుగులగా ఉంది. కాగా టీ20 ప్రపంచకప్-2026 విజయం తర్వాత భారత జట్టుకు సూర్యకుమార్ దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే.

## కుర్రాళ్లు కుమ్మేస్తున్నారు: గేల్



ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లు ప్రదర్శిస్తున్న నిర్భయమైన, దూకుడైన ఆటతీరును వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ప్రశంసించాడు. కొత్త తరం క్రికెటర్లు ఎలాంటి జంకు లేకుండా మొదటి బంతి నుంచే దాడికి దిగడం వల్లే ఆటలో స్కోరింగ్ రేటు, పవర్ హిట్టింగ్ గణనీయంగా పెరిగాయని ఈ 'యూనివర్స్ బాస్' అభిప్రాయపడ్డాడు. ఈ మార్పు క్రికెట్‌కు సానుకూలమైన పరిణామమని పేర్కొన్నాడు. షార్జా క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (ఔజూ) సందర్భంగా గేల్ మీడియాతో మాట్లాడాడు. "బౌలర్లు కాకుండా బ్యాటర్లు రికార్డులు బద్దలు కొడుతుండడం నాకు సంతోషంగా ఉంది. దీనికి కారణం, యువతరం ఇప్పుడు భయం లేని క్రికెట్ ఆడుతోంది. మొదటి బంతి నుంచే దాడి చేస్తున్నారు. ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడుతున్నారు. ఆట మారింది, ఆటగాళ్లు మారారు. పరుగులు చేయడానికి బ్యాటర్లు ఆకలితో ఉన్నారు. వారి నిర్భయమైన ఆటతీరు క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది" అని గేల్ వివరించాడు. ఇదే అంశంపై వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో బౌలర్ల కోణంలో స్పందించాడు. బ్యాటర్ల దూకుడు ఆటకు అద్భుతంగా మేలు చేస్తున్నప్పటికీ, బౌలర్లు ఈ కొత్త శకానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పాడు. "ప్రపంచవ్యాప్తంగా బ్యాటింగ్ తీరు చూస్తుంటే, ఇప్పటి ఆటలో నేను లేనందుకు సంతోషంగా ఉంది. బ్యాటర్ల నైపుణ్యాలు విపరీతంగా పెరిగాయి. ఈ మార్పులకు అనుగుణంగా బౌలర్లు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి, కొత్త ఆవిష్కరణలు చేయాలి" అని బ్రావో అన్నాడు. భవిష్యత్తులో వన్డేల్లో 400, 500 పరుగుల స్కోర్లు కూడా ఆశ్చర్యం కలిగించవని జోస్యం చెప్పాడు.

## పంజాబ్ కింగ్స్‌కు కోచ్‌ల గుడ్ బై

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో కీలక బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరి నిష్క్రమణతో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ నేతృత్వంలోని కోచింగ్ బృందంలో పెద్ద లోటు ఏర్పడింది. జేమ్స్ హోప్స్ క్వీన్స్‌లాండ్, బ్రిస్బేన్ హీట్ జట్లకు హెడ్ కోచ్‌గా నియమితుడు కాగా, బ్రాడ్ హాడిన్ న్యూ సౌత్ వేల్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇదివరకే పంజాబ్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న సైరాజ్ బహుతులే భారత జట్టు కోచింగ్ సిబ్బందిలో చేరగా, ఇప్పుడు మరో ఇద్దరు కీలక సభ్యులు దూరం కావడం పంజాబ్ యాజమాన్యానికి కొత్త సవాలుగా మారింది. హోప్స్ గత రెండు సీజన్లుగా పంజాబ్ జట్టుతో కొనసాగుతున్నాడు. గతంలో అతడు పాంటింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ బృందంలోనూ పనిచేశాడు. బ్రాడ్ హాడిన్ 2022 నుంచి పంజాబ్ కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా ఉన్నాడు. ప్రస్తుతం వీరిద్దరూ ఆస్ట్రేలియాలో జరుగుతున్న షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో తమ కొత్త బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## వైభవ్ విషయంలో తొందరొద్దు: కపిల్ దేవ్



టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై వస్తున్న ప్రశంసల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. అద్భుత ప్రతిభ ఉన్నప్పటికీ, అతని కెరీర్‌పై ఇప్పుడే భారీ అంచనాలు పెట్టుకోవడం తొందరపాటు అవుతుందని హెచ్చరించాడు. ప్రతిభ ఒక్కటే సుదీర్ఘ కెరీర్‌కు గీటురాయి కాదని చెబుతూ, మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఉదంతాన్ని ఉదాహరణగా చూపించాడు. ఈ విషయంపై కపిల్ దేవ్ మాట్లాడుతూ... "ఇప్పుడే అతని గురించి మాట్లాడటం తొందరపాటు అవుతుంది. అతనికి సామర్థ్యం ఉందా? అంటే.. కచ్చితంగా ఉంది. కానీ క్రికెట్‌లో ఎంతో మంది అపారమైన ప్రతిభతో అరంగేట్రం చేసి, ఆ తర్వాత కనుమరుగైపోయారు" అని అన్నాడు. "వినోద్ కాంబ్లీని చూడండి. దాని గురించి మనం ఏం చెప్పగలం?" అని ప్రశ్నించాడు. "వైభవ్‌కు ఇప్పుడు 15 ఏళ్లు. అతనికి మరో మూడేళ్ల సమయం ఇవ్వండి, ఆ తర్వాత మనం మాట్లాడదాం. అప్పటికి అతని జీవనశైలి, ఆలోచనా విధానం ఎలా మారతాయో చూడాలి. ప్రస్తుత ప్రదర్శన కంటే రాబోయే రెండేళ్లలో అతను తనను తాను ఎలా మలచుకుంటాడనేది చాలా ముఖ్యం" అని కపిల్ వివరించాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# సాహిత్యానికి సరిహద్దులు లేవు

ఒక రచయితకు లభించే పురస్కారం కేవలం వ్యక్తిగత గౌరవం కాదు. అది ఒక రచనా ధోరణికి, ఒక ఆలోచనా విధానానికి, ఒక సాహిత్య ప్రయోగానికి లభించే ప్రపంచ గుర్తింపు. 2026 సాహిత్య నోబెల్ పురస్కారం కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు ప్రకటించడం కూడా ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. సాహిత్యం అంటే ఒక నిర్దిష్టమైన ప్రక్రియలో, ఒక నిర్దిష్టమైన శైలిలో రాయడమే అన్న భావన చాలా కాలంగా ఉంది. కవిత్వం వేరు.. వ్యాసం వేరు.. అనువాదం వేరు.. పరిశోధన వేరు.. సృజనాత్మక రచన వేరు. కానీ కాలంతో పాటు సాహిత్యం కూడా తన సరిహద్దులను దాటుతోంది. ఈ మారుతున్న సాహిత్య స్వభావానికి అన్నే కార్సన్ రచనలు ఒక ఉదాహరణగా నిలుస్తున్నాయి. కవిత్వాన్ని మాత్రమే ఆశ్రయించకుండా, ప్రాచీన సాహిత్య అధ్యయనాన్ని ఆధునిక రచనా ప్రయోగాలతో మేళవించడం ఆమె ప్రత్యేకత. పదాల మూలాలను అన్వేషించడం నుంచి పురాతన సాహిత్యాన్ని సమకాలీన దృక్పథంతో చూడటం వరకు ఆమె రచనా ప్రయాణం సాగింది. అందుకే ఆమె రచనలు ఒకే ప్రక్రియకు పరిమితం కాకుండా కవిత్వం, అనువాదం, వ్యాసం, పరిశోధన మధ్య సరిహద్దులను చెరిపేస్తాయి. ఇక్కడే నేటి సాహిత్యానికి సంబంధించిన ఒక ముఖ్యమైన ప్రశ్న ముందుకు వస్తుంది. సాహిత్యం మారుతున్న సమాజాన్ని అనుసరించాలా? లేక సమాజమే సాహిత్యాన్ని అనుసరించేలా కొత్త దారులు చూపాలా? వాస్తవానికి రెండూ అవసరమే. సమాజంలో మారుతున్న భావాలను అక్షరాల్లో ప్రతిబింబించడంతో పాటు, పాఠకుడిని కొత్తగా ఆలోచింపజేయడం కూడా సాహిత్య బాధ్యత. అన్నే కార్సన్‌కు దక్కిన గుర్తింపు ఈ రెండో కోణాన్ని ప్రత్యేకంగా గుర్తుచేస్తోంది. సంప్రదాయాన్ని తిరస్కరించకుండా, దానితో సంభాషిస్తూ కొత్త రూపాలను అన్వేషించడం సృజనాత్మకతకు అవసరమైన స్వేచ్ఛను సూచిస్తుంది. పాత సాహిత్యాన్ని కేవలం మ్యూజియంలో భద్రపరిచిన వస్తువుగా చూడకుండా, దానిని వర్తమానంతో అనుసంధానించడం ద్వారా కొత్త అర్థాలను సృష్టించవచ్చని ఆమె రచనా ప్రయోగాలు చెబుతున్నాయి. నిజానికి సాహిత్యానికి గీతలు గీయడం కష్టం. ఒక కవితలో చరిత్ర ఉండవచ్చు. ఒక వ్యాసంలో కవిత్వం ఉండవచ్చు. ఒక అనువాదంలో కొత్త సృజన పుట్టవచ్చు. ఒక ప్రాచీన పదానికి ఉన్న మూలాన్ని అన్వేషించడం కూడా సమకాలీన సమాజాన్ని అర్థం చేసుకునే మార్గంగా మారవచ్చు. సాహిత్యపు అసలు శక్తి ఇలాంటి అనుసంధానాల్లోనే ఉంటుంది. నోబెల్ వంటి అంతర్జాతీయ పురస్కారాలు అందుకే ముఖ్యమైనవి. అవి కేవలం అత్యధికంగా అమ్ముడైన పుస్తకాలను లేదా విస్తృత ప్రచారం పొందిన రచయితలను మాత్రమే గుర్తించవు. కొన్నిసార్లు ప్రధాన సాహిత్య ప్రవాహానికి భిన్నంగా ప్రయోగాలు చేస్తున్న రచయితలను ప్రపంచం ముందుకు తీసుకొస్తాయి. తద్వారా పాఠకుల దృష్టిని కొత్త రచనా ప్రపంచాల వైపు మళ్లిస్తాయి. అన్నే కార్సన్‌కు లభించిన ఈ గౌరవం మరో విషయాన్ని కూడా స్పష్టం చేస్తోంది. భాష మారినా, దేశాలు మారినా, కాలాలు మారినా గొప్ప సాహిత్యానికి ఒక సామాన్య లక్షణం ఉంటుంది. అది మనిషిని ప్రశ్నిస్తుంది. ఆలోచింపజేస్తుంది. తెలిసిన ప్రపంచాన్ని కొత్త కోణంలో చూడమంటుంది. ఇప్పటి వేగవంతమైన డిజిటల్ ప్రపంచంలో చదవడానికి సమయం తగ్గుతోంది. చిన్న సందేశాలు, తక్షణ స్పందనలు, క్షణిక వినోదం మన దైనందిన జీవితాన్ని ఆక్రమిస్తున్నాయి. ఇలాంటి సమయంలో లోతైన ఆలోచనకు, భాషా ప్రయోగానికి, సృజనాత్మకతకు సాహిత్యం ఇస్తున్న స్థానం మరింత విలువైనది. అందుకే అన్నే కార్సన్‌కు దక్కిన నోబెల్ పురస్కారాన్ని ఒక రచయిత్రికి లభించిన గౌరవంగా మాత్రమే చూడకూడదు. సాహిత్యం ఇంకా ప్రయోగించగలదని, కొత్త రూపాలను సృష్టించగలదని, సంప్రదాయాన్ని ఆధునికతతో కలపగలదని ప్రపంచ సాహిత్యానికి లభించిన మరో గుర్తింపుగా చూడాలి. అక్షరాలకు సరిహద్దులు లేనప్పుడు.. సాహిత్యానికి కూడా హద్దులు ఉండవు. అదే సాహిత్యాన్ని సజీవంగా ఉంచే శక్తి.

# ఈటల పార్టీ మంచికే..!



తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర రాజకీయాలు ప్రధానంగా రెండు పెద్ద ప్రాంతీయ రాజకీయ శక్తుల చుట్టూనే తిరిగాయి. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడం, బీజేపీ బలపడటం, బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వెళ్లడం వంటి పరిణామాలతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారాయి. అయినప్పటికీ ఒక ప్రశ్న మాత్రం ఇంకా పూర్తిగా సమాధానం పొందలేదు. తెలంగాణలో సామాజిక వర్గాల ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం ఎలా ఉండాలి? ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, పేదలు, చిన్న రైతులు, చేతివృత్తిదారులు, గ్రామీణ యువతకు రాజకీయ అధికార నిర్మాణంలో ఎంత స్థానం దక్కుతోంది? ఈ ప్రశ్నల చుట్టూ కొత్త రాజకీయ వేదిక ఏర్పడితే దాని చర్చ సహజంగానే ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్ ‘బహుజన జనతా సమితి’ పేరుతో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నారని ప్రచారం నడుస్తోంది. ‘బహుజన జనతా సమితి’ అనే పేరే సామాజిక న్యాయం, బహుజన ప్రాతినిధ్యం, అధికార వికేంద్రీకరణ వంటి అంశాలను రాజకీయ కేంద్రబిందువుగా చేసుకునే సంకేతాన్ని ఇస్తోంది. అయితే పేరు పెట్టుకోవడం ఒకటి.. దానికి తగ్గ రాజకీయ సిద్ధాంతాన్ని, కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లడం మరొకటి. తెలంగాణలో ఇప్పటికే సామాజిక న్యాయం, బహుజన రాజకీయాలు, ప్రాంతీయ హక్కుల పేరుతో అనేక వేదికలు, పార్టీలు ఏర్పడ్డాయి. వాటిలో కొన్ని ప్రభావం చూపగా, మరికొన్ని ఎన్నికల రాజకీయాల్లో నిలదొక్కుకోలేకపోయాయి. కాబట్టి కొత్త పార్టీకి అసలు పరీక్ష పేరు కాదు.. ప్రజలకు అది ఏం భిన్నంగా అందిస్తుందన్నదే. ఈటల రాజేందర్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఈ చర్చకు మరో కోణం కనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న ఆయన బీఆర్ఎస్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్నారు. బహుజన రాజకీయాలు అంటే కేవలం బహుజనుల పేరుతో పార్టీ ఏర్పాటు చేయడం కాదు. బహుజనుల సమస్యలను స్పష్టమైన విధానాలుగా మార్చాలి. స్థానిక సంస్థల నుంచి శాసనసభ వరకు ప్రాతినిధ్యంపై స్పష్టమైన వైఖరి ఉండాలి. కులగణన, విద్య, ఉద్యోగాలు, భూమి, వ్యవసాయం, చేతివృత్తులు, చిన్న వ్యాపారాలు, యువత ఉపాధి, మహిళల ఆర్థిక సాధికారత వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక అవసరం. కేవలం అధికార పార్టీలపై విమర్శలు చేయడం ద్వారా బహుజన రాజకీయాలు బలపడవు. మరో ముఖ్యమైన అంశం నాయకత్వం. ఒక పార్టీ ఒకే నాయకుడి చుట్టూ తిరిగితే అది కొత్త రాజకీయ సంస్కృతిని తీసుకురాలేదు. బహుజన రాజకీయాల పేరుతో ఏర్పడే పార్టీ అయితే గ్రామస్థాయి నాయకత్వాన్ని పెంచాలి. వెనుకబడిన వర్గాల నుంచి స్థానిక నాయకులను తయారు చేయాలి. పార్టీ పదవులు, ఎన్నికల టికెట్లు, నిర్ణయాధికారంలో సామాజిక ప్రాతినిధ్యం ఉండాలి. లేకపోతే ‘బహుజన’ అనే పేరు రాజకీయ నినాదంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది.



**రామస్వామి చింత**



క్యాన్సర్ అనే మాట వినగానే భయంతో పాటు మరో ఆందోళన కూడా కుటుంబాలను వెంటాడుతోంది. చికిత్స ఎంతకాలం సాగుతుంది? ఎంత ఖర్చవుతుంది? ఆర్థికంగా కుటుంబం ఎంతవరకు తట్టుకోగలదు? అన్న ప్రశ్నలు రోగితోపాటు కుటుంబ సభ్యులను వేధిస్తుంటాయి. అనేక సందర్భాల్లో వ్యాధితో పోరాటం కంటే చికిత్సకు అయ్యే ఖర్చుతో పోరాటమే పెద్దదిగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ మందుల ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ధరల నియంత్రణ పరిధిలో లేని క్యాన్సర్ మందులపై వ్యాపార మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయడం సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు.

# క్యాన్సర్ రోగులకు ఉపశమనం?

మందుల తయారీ ధరకు, రోగి చెల్లించే ధరకు మధ్య ఉండే భారీ వ్యత్యాసాన్ని తగ్గించే ప్రయత్నం ఇది. కొన్ని మందుల గరిష్ఠ చిల్లర ధరలు 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉందన్న అంచనా క్యాన్సర్ రోగులకు ఆశ కలిగిస్తోంది. ఈ నిర్ణయంతో రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల వరకు ఆదా కావచ్చన్న కేంద్ర ప్రభుత్వ అంచనా కూడా ఈ చర్య పరిధిని తెలియజేస్తోంది. ఒక మందును రిటైలర్‌కు రూ.2,700కు సరఫరా చేసి, అదే మందుపై రూ.27 వేల గరిష్ఠ చిల్లర ధరను నిర్ణయించడం ఎంతటి వ్యత్యాసమో చెప్పడానికి ఈ ఉదాహరణ ఒక్కటే చాలు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధికి చికిత్స పొందుతున్న కుటుంబం ప్రతి రూపాయినీ లెక్కించుకునే పరిస్థితిలో ఇలాంటి ధరల వ్యత్యాసం ఆందోళన కలిగించకమానదు. మందు ధరలో తయారీ వ్యయం, సరఫరా వ్యయం, పరిశోధన వ్యయం వంటి అంశాలకు స్థానం ఉండవచ్చు. కానీ రోగి భరించలేని స్థాయిలో ధరలు పెరగడం మాత్రం ప్రజారోగ్య వ్యవస్థ ముందుంచే తీవ్రమైన ప్రశ్న. ఇదే అంశంపై సుప్రీంకోర్టు కూడా ప్రశ్నలు లేవనెత్తడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మందులపై ఒకే విధమైన మార్జిన్‌ను నిర్ణయించే అవకాశం లేదా? అన్న ప్రశ్న ద్వారా ధరల నిర్మాణంలో పారదర్శకత, సముచితతపై దృష్టి సారించింది. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల కింద చికిత్స పొందుతున్న రోగులు ఆసుపత్రుల సొంత ఔషధ దుకాణాల నుంచే మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులపైనా కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అయితే ధరలను తగ్గించడం మాత్రమే సరిపోదు. తగ్గించిన ధర నిజంగా రోగికి అందుతున్నదా లేదా అన్నదే అసలు పరీక్ష. తయారీదారులు, పంపిణీదారులు, రిటైలర్లు, ఆసుపత్రుల స్థాయిలో నిర్ణయం అమలు ఎలా జరుగుతుందన్న దానిపై సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరం. కాగితాలపై ధర తగ్గి, వాస్తవ కొనుగోలు సమయంలో రోగికి అదే పాత భారం కొనసాగితే ఈ నిర్ణయ లక్ష్యం నెరవేరదు. 2019లోనూ 42 ధరల నియంత్రణ పరిధిలో లేని క్యాన్సర్ మందులపై 30 శాతం వ్యాపార మార్జిన్ విధించినప్పుడు వందలాది బ్రాండ్ల గరిష్ఠ చిల్లర ధరలు గణనీయంగా తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. అప్పట్లోనే రోగులకు వందల కోట్ల రూపాయల మేర ఆదా జరిగిందని అంచనా. ఇప్పుడు ఆ పరిధిని మరింత విస్తరించడం సరైన దిశలో మరో అడుగుగా చూడవచ్చు. క్యాన్సర్ చికిత్స ఖర్చు కేవలం మందులకే పరిమితం కాదు. శస్త్రచికిత్స, రేడియేషన్ చికిత్స, రక్త పరీక్షలు, ఆసుపత్రి ఖర్చులు, ప్రయాణం, పోషకాహారం, పని దినాల నష్టం.. ఇలా అనేక రకాల ఆర్థిక భారాలు కుటుంబంపై పడతాయి. మందుల ధరలు తగ్గడం ఆ భారంలో ఒక ముఖ్యమైన భాగాన్ని మాత్రమే తగ్గిస్తుంది. అందువల్ల క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురావడానికి సమగ్ర విధానం అవసరం. జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం, జన ఔషధి కేంద్రాల విస్తరణ, దిగుమతి సుంకాల తగ్గింపు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన మందుల లభ్యత, బీమా పథకాల పరిధి విస్తరణ వంటి చర్యలు కూడా సమాంతరంగా సాగాలి. ముఖ్యంగా గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉండేలా ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రాణాలను కాపాడే మందు ఒక సాధారణ వినియోగ వస్తువు కాదు. దాని ధరను నిర్ణయించేటప్పుడు మార్కెట్ ప్రయోజనాలతో పాటు మానవ ప్రాణానికి ఉన్న విలువను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. వ్యాపారానికి లాభం అవసరమే అయినా, ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న రోగి నిస్సహాయతను అధిక లాభాలకు అవకాశంగా మార్చకూడదు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం అందుకే ఆశాజనకంగా కనిపిస్తోంది. అయితే అసలు ఫలితం ప్రకటనలో కాదు.. అమలులో ఉంటుంది. 70 శాతం వరకు ధరలు తగ్గే అవకాశం ఉందన్న మాట నిజంగా రోగి బిల్లులో కనిపించినప్పుడే ఈ నిర్ణయానికి అర్థం ఉంటుంది.



**వెంకటేశ్ గుగ్గిళ్ల**
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.